అక్టోబర్ 2016

దీపావళి పండుగ శుభాకాంక్షలతో!

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక వెల రూ.25/-

సంపుటి: 2 సంచిక: 7 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 రూ. అక్టోబరు 2016

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

సందర్శించండి: http://kottapalli.in/2016/10/welcome

లైసెన్సు వివరాలు: http://creativecommons.org/licenses/by-nc-sa/4.0/

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2015-17

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు: 7799260684

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయ సూచిక

పరిచయం... 4

సుభాషితమ్... 5

దీపావళి.. ముందుమాట.. 6

పిల్లలు రాసిన కథలు

మేధో మూర్తి...లీలా గాయత్రి... 8

తీపి-చేదు...సంహిత... 12

మంచి మనసు...నేహల్ గుప్త.. 15.

టార్జాన్...జరీదుద్దీన్... 17

తులసి...జువేరియ... 20

మోసకారి పిల్లి...అనూష... 23

బుద్ధి వచ్చింది...కోటేశ్వర రావు... 26

పెద్దరికం...వీరాంజనేయులు... 28

మూడు సలహాలు... 32

పెద్దలు రాసిన కథలు

భారవి...ENV రవి... 37

చెన్నయ్య ఆదర్శం...మద్దిరాల... 42

పట్టాభిషేకం...శివ లక్ష్మి... 59

అనువాద కథలు

మహాకాలుని గాథ...బౌద్ధ కథ... 48

నేతగాడు-డ్రాగన్... 53

అవీ-ఇవీ

లేబుల్స్...కొత్తపల్లి... 35

బొమ్మకు కథ...కొత్తపల్లి... 65

బొమ్మలు-పదాలు...హైమావతి... 63

పదాల్ని వెతికి...కొత్తపల్లి... 36

పదరంగం..డా సిరి... 66

పరిచయం..

అచ్చు పుస్తకాలకూ, మనం రాసుకునే నోట్సులకూ అట్టలు వేసుకుంటే అవి చినిగిపోకుండా భద్రంగా ఉంటాయి. మీ పుస్తకాలకు అట్టలు వేసుకుంటుంటారుగా? ఓసారి అట్టలు వేసుకున్నాక, ఏ పుస్తకం ఏంటో తెలీటం కోసం వాటికి లేబుళ్ళు అంటిస్తాం; అవి ఎంత అందంగా ఉంటే అంత సంతోష పడతాం. ఇదిగో- ఈ కొత్తపల్లితో అట్లాంటి చూడ-ముచ్చటైన లేబుళ్ళు ఎనిమిదింటిని అందుకోండి. వాటిని కత్తిరించే ముందుగానే, మరి వాటి వెనక ఉన్న 'పదాల్ని వెతికి కనుక్కోండి'!

ఇప్పుడిప్పుడే తెలుగు చదవటం మొదలు పెడ్తున్న పిల్లల కోసం ఈ మాసం నుండి 'బొమ్మలు చూసి-పదాలు వెతికే ఆటనొకదాన్ని మొదలు-పెడుతున్నారు ఆదూరి హైమవతి గారు. మరి ఈ బొమ్మల్ని, పదాల్ని ఆరునెలలపాటు దాచుకోవాలట- ఎట్లా చేస్తారో, ఏమో?!

అమ్మ మాట వినకుండా ఊరికే కూర్చొని ఐస్క్రీములు తింటుంటారా, మీరుకూడా? అలా చేస్తుంటే ఏం జరుగుతుందో సంహిత కథ "తీపి-చేదు"లో చదవండి. ఇక, నీతి తప్పిన అడవిపిల్లికి ఏం దొరికింది? అనూష 'మోసకారి పిల్లి' చదివి కనుక్కోండి- ఇంకా చాలా కథలున్నైలే ఇందులో; చదివి ఏది బాగుందో చెప్పండి మాకు!


సుభాషితమ్
సుఖానువస్సిం విహరంతం ఇంద్రియేసు అసంవుతం
భోజనం హి చామత్తన్నుం కు సీతం హీన వీరియం
తం వే పసహతి మారో, వాతో రుక్ఖం వ దుబ్బలం
కేవలం సుఖాలనే చూసుకుంటూ, ఇంద్రియలోలులై, వశంలో లేని మనసుతో, రుచి-రంగులకే ఎవరైతే బానిసలై ఉంటారో, అటువంటి వాళ్ళు శక్తి హీనులు. బలహీనమైన చెట్టును గాలి పెకలించి వేసినట్లు, అటువంటి దుర్బలులను మారుడు తప్పక హరించివేస్తాడు. (అంటే కోరికలకు లోబడవద్దని భావం)

క్రూర మనస్కులౌ పతుల గొల్చి వసించిన మంచివారికిన్
వారి గుణంబు పట్టి చెడు వర్తన వాటిలు- మాధురీ జలో
ధారలు గౌతమీ ముఖ మహానదు లంబుధి గూడినంతనే
క్షారము జెందవే, మొదలి కట్టడలన్నియు దప్పి, భాస్కరా?

మారయ వెంకయ్య రచించిన **భాస్కర శతకం** లోనిది, ఈ పద్యం.
తియ్యటి నీళ్లతో నిండి ప్రవహించే మహానదులన్నీ కూడా ఒకసారి సముద్రుడిని చేరినాయంటే తమ పట్టును పూర్తిగా కోల్పోయి, ఉప్పు నీళ్లైపోతాయి. అదే విధంగా దుర్మార్గులైన యజమానులను చేరిన మంచివాళ్ళు కూడా ఆ దుర్గుణాలనే అంటించుకుంటారు. వాళ్ళు కూడా చెడుగానే ప్రవర్తించటం మొదలు పెడతారు. **చెడ్డవారి సావాసం కూడదు** అని భావం.

దీపావళి

పూర్వం ప్రాగ్జ్యోతిషం అనే దేశం ఒకటి ఉండేది. 'ప్రాక్ జ్యోతిషం' అంటే 'ముందుగా వెలుగును చూసేది' అని అర్థం. ఆ దేశాన్ని నరకుడు అనే రాజు పరిపాలించేవాడు.

నరకుడు మామూలు వాడు కాదు. స్వయానా భూమికి పుత్రుడు. భూమి మీద ఉన్న సమస్త సంపదలు, ఔషధాలు, భూమి లోపల ఉన్న సమస్తమైన ఖనిజాలు- అన్నిటి పైనా అతనిదే అధికారం; వాటి ఫలితాలన్నీ పూర్తిగా అతనికి లోబడినై. నరకుడు తీవ్రమైన తపస్సు చేసి ఈ విషయాలన్నీ కనుక్కోవడంతో పాటు, ఏ పురుషుని చేతా చావులేకుండా వరం కూడా పొందాడు, బ్రహ్మ నుండి.

అయితే అట్లా పరిపాలకుడిగా భూమిపైన సర్వ హక్కులూ పొందిన నరకుడు, అవన్నీ 'తన సొంతమే' అనుకున్నాడు. 'తన సొంత వస్తువుల్ని వేరే ఎవరికైనా ఎందుకివ్వాలి?'- అని, అవేవీ ఇతరులెవ్వరికీ దొరకకుండా కట్టడి చేశాడు. అంటే నరకుడు స్వార్థానికి చిహ్నం అనమాట.

ఔషధాలూ ఖనిజాలే కాక, ప్రాగ్జ్యోతిషం మీద ప్రథమంగా పడే వెలుగును కూడా ఇతరులకు అందకుండా చేసాడు నరకాసురుడు. 'శబ్దం-స్పర్శ-రూపం-రుచి-వాసన అనే జ్ఞానాలను తెలిపే శక్తులన్నింటినీ అతను అణచి పెట్టాడు. తన గొప్పతనాన్ని అంగీకరించని ఋషులని, సాధువులను, రాజులను హింసించటం మొదలుపెట్టాడు. పదహారు వేల మంది రాజకుమార్తెలను బందీలుగా చేసి పెట్టాడు. దేవమాత అదితి కర్ణ కుండలాలను, వానలు కురిపించే వరుణుడి గొడుగును కూడా తన కోటలో పెట్టేసుకున్నాడు.

నరకుడి భయానికి మనుషులందరూ తమలో తామే కుంచించుకు పోయారు. భూమిపైనే నరకమంటే ఏమిటో రుచి చూసారు. ప్రకాశానికి దూరమైన మానవజాతి అజ్ఞానంలోనూ,

పాపంలోనూ, చీకటిలోనూ కూరుకు పోసాగింది.

నరకుడి ఆగడాలు మిన్ను ముట్టేసరికి దేవతల రాజు ఇంద్రుడు 'తమ కష్టాలన్నిటినీ తీర్చగలిగే వాడెవడా' అని వెతుక్కున్నాడు. 'నరకుడిని పుట్టించిన తల్లి ప్రకృతి- భూమి తప్ప మరెవ్వరూ వాడిని చంపలేరు' అని కనుక్కున్నాడు. విష్ణువు అవతారమైన కృష్ణుడిని, స్వయంగా భూదేవి అయిన సత్యభామను దర్శించుకొని, నరకాసురుడి భారం తగ్గించమని వేడుకున్నాడు.

కృష్ణుడు సత్యభామ ఇద్దరూ గరుడ వాహనం ఎక్కి, ప్రాగ్జ్యోతిషానికి పోయి, నరకునితో యుద్ధం చేసారు. చివరికి సత్యభామ వదిలిన బాణం నరకాసురుడిని తుద ముట్టించింది. తల్లి స్వయంగా తన దుష్ట సంతానాన్ని హరించింది. జ్ఞాన కిరణాలు మళ్లీ ఒకసారి జగత్తు అంతటా నిరాటంకంగా ప్రసరించాయి.

అజ్ఞానానికి, చీకటికి ప్రతీకగా నిలచి, భూమి మీద నరకం చూపించిన నరకుడి చావుతో ప్రజలు అందరూ తనివి తీరా దీపాలు వెలిగించారు. బాణాసంచా కాల్చారు. పిండి వంటలు, మిఠాయిలు చేసుకున్నారు.

ఈ దీపావళి కథలోని పాత్రలేవీ నిజంగా ఉండనక్కర్లేదు. కథ ఉందిగా, చాలు! ఈ కథ ఏం చెబుతుంది? - ప్రకృతి ఎంత బలీయమైనదో చెబుతుంది ఈ కథ. ప్రకృతిలోని సంపదలు అన్ని ప్రాణులకీ చెందాలి తప్ప, వాటిని ఏ ఒక్క జీవీ, ఏ ఒక్క దేశమూ తన సొంతం చేసుకునేందుకు ప్రయత్నించకూడదని చెప్తుంది; ప్రపంచంలోని అన్ని ఘటనలనూ నిర్ణయించే శక్తిని ఏ ఒక్కరూ వశపరచుకోలేరని, దాన్ని ఎవ్వరూ దుర్వినియోగం చేయరాదని చెప్తుంది; చీకటీ-అజ్ఞానం ఏనాటికైనా తప్పకుండా నశిస్తాయని చెప్తుంది. ఆశావాదానికి పునాది వేస్తుంది!

మీకందరికీ మరి, వెలుగుల పండగ దీపావళి శుభాకాంక్షలు!

-కొత్తపల్లి బృందం.

మేధోమూర్తి

రచన; లీలా గాయత్రి రెడ్డి, 8 వ తరగతి, శ్రీ ఆదిత్యా ఇం.మీ.స్కూల్, నూతక్కి, మంగళగిరి

పానకాలయ్య ఓ సన్నకారు రైతు. అతని కుమారుడు మేధోమూర్తి. 'తాను చదువుకోకపోయినా, కొడుకు చదివితే చాలు' అనుకునేవాడు పానకాలయ్య.

కానీ పొలంలో కష్టపడితే ఇల్లు బొటాబొటిగా గడిచేది పానకాలయ్యకు. ఇక మేధోమూర్తి చదువు కోసం ఏమంత మిగిలేది కాదు- ఏ ఏటికాయేడు అప్పు చేయాల్సి వచ్చేది. 'ఎలాగోలా అప్పు తీరుద్దాంలే' అని అప్పట్లో అనుకున్నాడు. కానీ అనుకున్నది నెరవేరాలని లేదు కదా! మేధో మూర్తి చదువు పూర్తయ్యేసరికి అప్పు

రెండితలయ్యింది.

'కొడుకు ఏదైనా పని చేసుకొని, తన చదువు కోసం చేసిన అప్పులు తీర్చుకుంటాడు' అని ఆశపడ్డాడు పానకాలయ్య. అయితే ఆ సంగతి ఎత్తగానే మేధోమూర్తి చికాకు పడ్డాడు- "నువ్వు చేసిన అప్పుకు నేనెట్లా బాధ్యుణ్ణి అవుతాను?" అనేసాడు.

పానకాలయ్యకు ఏం చెప్పాలో తోచలేదు. "అదేంటిరా, ఆ అప్పులు చేసింది నీ చదువు కోసమేగా? నువ్వు చదువుకొని ఏదో ఒక మంచి పని చేసుకుంటూ మన కుటుంబాన్ని నడిపిస్తావనేగా?" అన్నాడు.

"అట్లా ఊహించుకోకండి. మీరనేది ఒకప్పటి మాట. ఇప్పుడు కాలం మారింది. జీవితం వేగంగా నడుస్తున్నది. ఇప్పటి యువకులకు స్వేచ్ఛ కావాలి. 'మన కుటుంబం' అని భజన చేసుకుంటూ, ఊరికే మీకు సేవలు చేస్తూ కూర్చుంటే నా పనులు సాగవు. ఇంకో సంగతి- మీకు చెప్పలేదుగానీ, నాకు పోయిన సంవత్సరమే ఉద్యోగం వచ్చింది. కంపెనీ వాళ్ళు మా కాలేజీకే వచ్చి కాల్‌లెటర్ ఇచ్చి వెళ్ళారు. మంచి జీతమే వస్తుంది. నా బ్రతుకు నేను బ్రతుకచ్చు. మీ సంగతి మీరు చూసుకోండి- మరోలా అనుకోకండి" అని చెప్పి, చకచకా బట్టలు సర్దుకొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు కొడుకు.

పానకాలయ్యకు కళ్ళు తిరిగాయి. "అయినా వీడిని చదివించే బాధ్యత నాదే- అప్పు చేసినా, సొప్పు చేసినా అంతా నా బాధ్యతే కదా, వాడికి అప్పు తీర్చాల్సిన అవసరం ఏమీ లేదు నిజంగానే" అని సర్ది చెప్పుకొని, తానే వేరే ఏర్పాటు చేసుకున్నాడు.

అట్లా కొంత కాలం గడిచాక, అనుకోని

రీతిగా వరసగా కొన్నేళ్ళపాటు వర్షాలు బాగా పడ్డాయి. అన్నీ అనుకూలించాయి. పంటలు బాగా పండాయి; ధరలు కూడా బాగా వచ్చాయి. ఊహించనంత డబ్బు వచ్చింది పానకాలయ్యకు. దాంతో కుటుంబం గట్టెక్కింది. అప్పులన్నీ తీరటమేగాక, కష్టాల్లో ఉన్నవారికి ఒకింత దానం చెయ్యగల స్థితికి వచ్చాడు.

నిజంగానే "కాలం ఓ అనుకూల ప్రతికూల పవనాల సమూహం కదా, ఓ చిత్ర విన్యాస కెరటం అది".

ఎంతో సంపాదిద్దామని బయటికి వెళ్లిన మేధోమూర్తి 'అంతా నేనే- అంతా నా యిష్టం' అనే గర్వంతో విచక్షణా రహితంగా ప్రవర్తించి తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేయాల్సిన స్థితికి చేరుకున్నాడు. కంపెనీవాళ్ళు అతన్ని వదిలించుకోవ-టమేగాక, తోటి కంపెనీలకు కూడా అతని గురించి చెడుగా చెప్పటంతో, అతనికి ఇక ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. అలా కొంతకాలం గడిచేసరికి మేధోమూర్తికి బ్రతుకంటే భయం పట్టుకున్నది. మనసు దుర్బలమై; వెర్రివాడిలా ఎటుపడితే అటు తిరగనారంభించాడు.

ఓసారి ఎరువులు తెచ్చేందుకని పట్నం వెళ్ళిన పానకాలయ్యకు చినిగిపోయిన దుస్తులతో దర్శనమిచ్చాడు మేధోమూర్తి! బిడ్డను గుర్తు పట్టిన పానకాలయ్య గబగబా అతని దగ్గరికి వెళ్లి ప్రేమగా "నాయనా, మూర్తీ! ఎలా ఉన్నావురా? ఏంటిరా, ఇలా అయ్యావు?" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

అన్నేళ్ల తరువాత తండ్రిని చూసిన మూర్తి ఏమీ మాట్లాడలేదు; ఏడుస్తూ తండ్రి

పాదాల మీద పడ్డాడు.

వాడిని ఇంటికి తీసుకెళ్లి స్నానం చేయించి, భోజనం పెట్టి, తనతో పాటే వ్యవసాయపు పనులు నేర్పి, మళ్ళీ ఓసారి ప్రయోజకుడిని చేశాడు పానకాలయ్య.

ఆ తర్వాత మేధోమూర్తి కుదురుకున్నాడు. తండ్రితోబాటు వ్యవసాయంలో నిలద్రొక్కుకొని, మెల్లగా తన చదువుకు తగిన పనులు కూడా చేసుకుంటూ, 'మంచివాడు' అని పేరు తెచ్చుకున్నాడు.

తానా- మంచి పుస్తకం వారి సంయుక్త నిర్వహణలో

బాల సాహిత్య రచనల పోటీ-2017

* **తానా** (ఉత్తర అమెరికా తెలుగు సంఘం - TANA) కు నలభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా **"బాల సాహిత్య రచనల పోటీ - 2017"** ని **మంచి పుస్తకం, హైదరాబాదు** వారితో కలిసి నిర్వహిస్తోంది.

* **రచనాంశం:** ఆధునిక సాహస, హాస్య, కాల్పనిక విజ్ఞాన నవల లేదా కథా గుచ్ఛం.
సచిత్ర నవలలు; కామిక్ స్ట్రిప్పులు; గ్రాఫిక్ నవలలు కూడా.

పోటీ రెండు విభాగాలుగా ఉంటుంది.

1) పది సంవత్సరాలలోపు పిల్లల కోసం రాసినవి.

2) పది సంవత్సరాల పైబడిన పిల్లల కోసం రాసినవి.

త్వరపడండి!
మొత్తం లక్ష రూపాయల బహుమతులు!
చివరి తేదీ: 2017 జనవరి 31

* ఒక్కొక్క విభాగంలోనూ ఒక్కోటీ పది వేల రూపాయల చొప్పున అయిదు బహుమతులు. రెండు విభాగాలలోనూ కలిపి మొత్తంగా పది బహుమతులు! బహుమతుల మొత్తం విలువ లక్ష రూపాయలు!

రచనలు పంపాల్సిన చిరునామా: మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం: 1, తార్నాకా, సికింద్రాబాద్-17

మరిన్ని వివరాలకై మంచి పుస్తకం వెబ్సైటు www.manchipustakam.in చూడండి.
లేదా భాగ్యలక్ష్మి (9490746614), వాసిరెడ్డి నవీన్ (9849310560) కి ఫోన్ చేయండి.

తీపి - చేదు

బొమ్మల కథ

రచన : సంహిత వాధూలస, నాలుగవ తరగతి, శ్రీకృష్ణా ఇం.మీ స్కూల్, అనంతపురం.

ఒక రోజు రాము తన బంతితో ఆడుకుంటూ ఉన్నాడు. ఆ బంతి అంటే వాడికి చాలా ఇష్టం. "ఎంతసేపటి నుండి ఆడుకుంటూ ఉన్నానో, ఆకలిగా ఉంది! చల్లగా ఏమైనా తినాలనిపిస్తోంది. టీవీ చూస్తూ ఐస్క్రీమ్ తిందాం!" అనుకున్నాడు వాడు.



"అమ్మా నాకు ఐస్క్రీమ్ కావాలి! ఇస్తావా?!" అని కేకలు పెట్టాడు.

అమ్మ ఒక ఐస్క్రీమ్ తెచ్చి ఇచ్చింది. అది తినగానే 'ఇంకోటి కావాలి' అని అడిగాడు రాము. అప్పుడు అమ్మ 'వద్దు. నీకు కడుపులో తిప్పుతుంది' అని చెప్పింది.

"కానీ నాకు ఇంకా ఆకలి వేస్తోంది! నాకు ఇంకో ఐస్క్రీమ్ కావాలి! దానితోపాటు ఒక కురుకురె ప్యాకెట్టు కూడా కావాలి!" అని పేచీ మొదలెట్టాడు రాము.

దాంతో వాళ్ళ అమ్మకు కోపం వచ్చింది. 'నీకు ఏం కావాలంటే అది తిను- కానీ ముందే చెబుతున్నాను- నీకు కడుపులో తిప్పితే మటుకు నాకు చెప్పకు' అన్నది.

అప్పుడు వాడు ఐస్క్రీమ్‌లు, కుర్‌కురేలు అన్నీ తింటూ మూడు గంటల పాటు టీవీ చూస్తూనే కూర్చున్నాడు.

ఆ సరికి అమ్మ, నాన్న అందరూ నిద్రపోయారు.

ఆరోజు అర్ధరాత్రి నిద్ర లేచి 'అమ్మా, కడుపు తిప్పుతోంది, కళ్ళు కూడా మండుతున్నాయి' అని ఏడ్చాడు రాము.

"అందుకేగదా, ఐస్‌క్రీమ్‌లు, కుర్‌కురేలు తినద్దురా, అన్నది? ఇప్పుడేం చేస్తాం? పద, డాక్టర్ దగ్గరకు!" అని డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళింది అమ్మ.

డాక్టర్ మందులిస్తూ 'ఇవిగో, ఈ మందులు వేసుకో. ఇకనైనా అమ్మ మాట విని మంచిగా ఉంటావుగా?' అన్నాడు.

'ఓ తప్పకుండా వింటానండి డాక్టర్ గారు' మర్యాదగా తల ఊపాడు రాము!

కొత్తపల్లి ప్రింటు పుస్తకాలను ఆన్‌లైన్లో ఆర్డరు చేయటం, చందాలు కట్టటం చాలా సులభం! క్రెడిట్ కార్డుల ద్వారాను, డెబిట్ కార్డుల ద్వారాను, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఇప్పుడు కొత్తపల్లికై డబ్బులు చెల్లించవచ్చు! అక్కౌంటు నెంబర్లు వెతుక్కునే పని కూడా లేదు !

సందర్శించండి: **http://www.instamojo.com/kottapalli**

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు. పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !

మంచి మనసు

బొమ్మల కథ

రచన: నేహల్ గుప్త, ఏడవ తరగతి, ఇం.మీ, శ్రీ వెంకటేశ్వర హై స్కూల్, జహీరాబాద్, మెదక్ జిల్లా.

శంకర్ వారానికి ఒకరోజు అడవికి పోతుంటాడు- కట్టెలకోసం. ఒకసారి అట్లా కట్టె పుల్లలు ఏరుకొచ్చేందుకు అడవికి వెళ్లాడు.

దారిలో ఒక ముసలివాడు ఎదురయ్యాడు. "బాగా ఆకలిగా ఉంది నాయనా, నీ దగ్గర ఏమైనా ఉందా, తినేందుకు?" అని అడిగాడు. శంకర్‌కి అతన్ని చూస్తే జాలి వేసింది. కానీ అతనికి ఇచ్చేందుకు శంకర్ దగ్గర ఏమీ లేదు. నిరుత్సాహంగా తల ఆడించి ముందుకు సాగాడు అతను.

అడవి అంచుల్లోనే అతనికి ఒక జింక ఎదురైంది.

దాహంతో ఆ చుట్టు ప్రక్కల అంతా వెతుకుతున్నది అది నీళ్ల కోసం. శంకర్‌కి దాన్ని చూసి జాలి వేసింది. కానీ తన దగ్గర

కూడా నీళ్లు లేవు- ఏం చేయగలడిక?

అట్లానే ముందుకెళ్ళి, తనకు దొరికినన్ని కట్టె పుల్లలు ఏరుకొని మూటకట్టుకున్నాడు.



వెనక్కి తిరిగి వెళ్తుంటే ఒక గుడ్డాయన ఎదురయ్యాడు. "నాయనా! వంటకు బొత్తిగా కట్టెలు లేవు. కొన్ని కట్టెలు ఇవ్వగలవా? నేను వండింది నీకు కూడా కొంచెం పెడతాను" అన్నాడు.

శంకర్‌కి అతన్ని చూస్తే జాలి వేసింది. "సరే, ఇవి నువ్వు తీసుకో. నేను మరిన్ని ఏరుకొచ్చుకుంటాను" అని తను ఏరిక కట్టెలు అతనికి ఇచ్చేసి, ఆ చుట్టుప్రక్కల దొరికిన కట్టెలన్నీ తనకోసం జమ చేసుకున్నాడు.

ఆలోగా వంట పూర్తయింది. గుడ్డాయన తనకు ఇచ్చిన అన్నం మూట కట్టుకొని, కొన్ని నీళ్ళు కూడా తీసుకొని వెనక్కి తిరిగాడు శంకర్.

జింకకు నీళ్ళు, ముసలాయనకు అన్నం ఇచ్చి, తృప్తిగా ఇంటిదారి పట్టాడు.

అంతలోనే దేవుడు ప్రత్యక్షమయ్యాడు శంకర్ ముందు. "ఇంతకు ముందు కనిపించిన జింక, ముసలాయన, గ్రుడ్డాయన అన్నీ నేను సృష్టించినవే. నువ్వు చాలా మంచి పని చేశావు. నీ ఈ సాయం వృధా పోదు" అని అభినందించి మాయం అయ్యాడు!

టార్జాన్

సేకరణ, కథనం : యం.డి. జరీదుద్దిన్, ఏడవ తరగతి, ఇం.మీ, శ్రీ వెంకటేశ్వర హైస్కూల్, జహీరాబాద్.

అనగనగా ఒక దట్టమైన అడవి ఉండేది. ఆ అడవిలో చాలా జంతువులు ఉండేవి. అడవిలో దారులన్నీ తికమక పెట్టేలా ఉండేవి. ఆ అడవిలో ఒక మనిషి కూడా ఉండేవాడు. అతని పేరు టార్జాన్. టార్జాన్ జంతువులను ప్రేమించేవాడు. వాటిని రక్షించేవాడు.

ఒకసారి ఆ అడవిలోకి కొందరు వేటగాళ్లు వచ్చారు. జంతువులను చంపి వాటి చర్మాలను వేరే దేశాలలో అమ్మి డబ్బు సంపాదిస్తుంటారు వాళ్ళు. ఈ సంగతి టార్జాన్‌కి తెలిసింది. అతను వేటగాళ్ళకోసం వెతుక్కుంటూ పోయాడు.

కోతులు, పక్షులు అన్నీ టార్జాన్‌కి తెలియజేసాయి, వేటగాళ్లు ఎక్కడున్నారో. టార్జాన్ ఆ ప్రాంతానికి వెళ్ళేసరికి వేటగాళ్లంతా ఒక పులిని వెంటాడుతున్నారు.

టార్జాన్ ధైర్యంగా పులికి అడ్డంగా వేటగాళ్ల ముందు నిల్చొని "ఆగండి! నేను ఉండగా మీరు ఈ పులిని చంపలేరు!" అని హెచ్చరించాడు. అయితే ఆ వేటగాళ్లంతా వెటకారంగా నవ్వి టార్జాన్‌నే షూట్ చేసారు. టార్జాన్ వాళ్ళందరినుండీ తప్పించుకొని, పైనుండి వ్రేలాడే ఊడల్ని పట్టుకొని ఊగుతూ దగ్గర్లోనే ఉన్న ఓ కొండ మీదికి చేరుకున్నాడు.

అడవిలో ఉన్న జంతువులన్నిటికీ అడవిలో ఏం జరుగుతున్నదో తెలిసింది. అన్నీ టార్జాన్ వెనక గుండ్రగా నిలబడ్డాయి. వాటన్నిటి మధ్యలో నిలబడిన టార్జాన్‌ని చూసి వేటగాళ్ళు ఆశ్చర్యపోయారు.

అప్పుడు టార్జాన్ వేటగాళ్లతో "చూడండి, ప్రాణం మీ మనుషులొక్కరికే కాదు- మా జంతువులకు ఉండేది కూడా ప్రాణమే. మీరు మాకు ఏలాంటి సాయమూ

చెయ్యకపోయినా పరవాలేదు కానీ దయచేసి మా దారిన మమ్మల్ని బ్రతకనివ్వండి. ఊరికే మా ప్రాణాలు తీసేందుకు అడవిలోకి రాకండి. మీరు మాకు కష్టం కలిగించకపోతే మేము కూడా మిమ్మల్ని ఏమీ చెయ్యం. అట్లా కాదంటే ఇక యుద్ధమే జరుగుతుంది. ఆ యుద్ధంలో మరి మీరు గెలుస్తారో, జంతువులు గెలుస్తాయో ఊహించుకోండి" అని చెప్పాడు.

అతని ధైర్యాన్ని, అడవి జంతువులకు అతని పట్ల ఉన్న గౌరవాన్ని చూసి వేటగాళ్ల మనసులు మారాయి. వాళ్లంతా మౌనంగా అడవి నుండి వెనక్కి తిరిగారు.

ఉచితమైతే చాలు!

కస్టమర్: ప్లేటు ఇడ్లీ-సాంబారు ఎంత?

సర్వర్: సాంబారుకు డబ్బు లేదు ఇవ్వనక్కర్లేదు సార్, ఫ్రీ

కస్టమర్: అయితే మూడు గ్లాసుల సాంబారు ఇవ్వండి!!



ఎన్నైనా పర్లేదు!

"పది క్రూరమృగాల పేర్లు చెప్పండి" అడిగాడు ఇంటర్వ్యూ అధికారి.

"ఐదు పులులు, ఐదు సింహాలు" చెప్పాడు చౌదరి.

"ఒక్క జంతువునే పది అంకెతో చెప్పాల్సింది" వెటకారంగా అన్నాడు అధికారి.

"వీడికి మరీ ఒకే ఒక్క జంతువు గురించే తెలుసుకుంటారేమోనని, అలా చెప్పానండి" సిగ్గుపడ్డాడు చౌదరి.

రామలింగడి స్ఫూర్తి!

తండ్రి: నువ్వు ఈసారి కూడా పరీక్షలో ఫెయిలైతే నీ మొహం నాకు చూపించకు.

కొడుకు: (కొద్ది రోజుల తర్వాత) సారి నాన్న మీరు నా మొహం చూపించొద్దన్నారు కదా అందుకనే తలకి హెల్మెట్ పెట్టుకొని వచ్చాను.



తులసి

కుటుంబగాథలు మన సమాజపు విభిన్న పార్శ్వాలను బయటికి తెస్తాయి. మనకున్న అసలు సమస్యలు ఏంటో తెలియజేస్తాయి. అట్లాంటి ఒక కథ ఇది- చదివి ఆలోచించండి..

రచన: యు. జువేరియ, 6 వ తరగతి, రాధా స్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురం.

రంగన్నది పేద కుటుంబం. వాళ్ళ నాన్న చెడు అలవాట్లకు బానిసై, ఇల్లంతా గుల్ల చేసి, చివరికి చనిపోయాడు. అమ్మ ఒక్కతే పిల్లల్ని నలుగురినీ పెంచలేక తంటాలు పడసాగింది.

ఇంట్లో రంగన్నే పెద్ద పిల్లవాడు. దాంతో వాడే ఇంటి బాధ్యతంతా నెత్తిన వేసుకున్నాడు. కూలికి పోయాడు; చదువుకు స్వస్తి చెప్పాడు. చెల్లెలినీ, తమ్ముళ్ళిద్దర్నీ చదివించాడు. ఆలోగా వాళ్ళ అమ్మ కూడా చనిపోయింది.

తమ్ముళ్లిద్దరూ అన్న చదివించిన చదువు

సహాయంతో మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారు. రంగన్నే ఇద్దరు తమ్ముళ్ళకూ పెళ్ళి చేశాడు. పెళ్ళి అవ్వగానే వాళ్ళిద్దరూ వేరుపడ్డారు. ఎవరికి వాళ్ళు సుఖంగా బ్రతకటం మొదలు పెట్టారు.

చెల్లెలి చదువు పూర్తయిందిగానీ, ఆ సరికి ఇక రంగన్న దగ్గర ఏమీ లేకుండా అయ్యింది. రంగన్నే ఆ పిల్లకు ఏదో ఉద్యోగం తెప్పించి, తగిన కుర్రాడిని చూసి పెళ్ళి చేసాడు.

తర్వాత రంగన్నను ఇంక ఎవరూ పట్టించుకోలేదు. రంగన్న కూలి పని ఆపి, గుజిరి వ్యాపారం (పాత సామాన్లు అమ్మే వ్యాపారం) లోకి దిగాడు. పనిలో పరిచయమైన సరోజను పెళ్ళి చేసుకున్నాడు. సరోజకూ వేరే ఎవ్వరూ లేరు. భార్యాభర్తలిద్దరూ కలిసి వ్యాపారాన్ని నడిపిస్తూ వచ్చారు. కొద్ది రోజులకు వాళ్ళకో కూతురు పుట్టింది, అమ్మాయికి తులసి అని పేరు పెట్టారు.

ఊహ తెలిసిన నాటినుండి తులసి తల్లి దండ్రులకు సహాయంగా ఉండేది. బడి ముగిసిన తరువాత ఆ పాప కూడా గుజిరి అంగడి దగ్గరే గడిపేది. అక్కడంతా కూర్చొని పాత పుస్తకాలు, పేపర్లు చదువుతూ వచ్చింది.

గుజరీ దుకాణం ద్వారానే ఆ పాపకు విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు అనేకం పరిచయమైనాయి. గొప్ప గొప్ప వాళ్ల జీవిత చరిత్రలు దొరికాయి; రకరకాల కథలు, నవలలు, సాంఘిక శాస్త్ర గ్రంధాలు అందాయి.

అలా ఆ పాపకు చక్కని సామాజిక దృష్టి

ఒకటి ఏర్పడింది.

గుజరీ దుకాణం పుణ్యాన తులసి రకరకాల విషయాలు తెలుసుకొన్నది; ఉద్యమాలలో పాలు పంచుకున్నది; పోటీ పరీక్షలు రాసి ఉత్తీర్ణురాలైంది; మంచి ఉద్యోగం కూడా తెచ్చుకున్నది.

రంగన్న శ్రమ జీవన సౌందర్యాన్ని, తులసి తెలివితేటలను, పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. శ్రమించేందుకు భయపడని రంగన్న, సమస్యలను జ్ఞాన సముపార్జనకు సాధనాలుగా మార్చుకున్న తులసి అనేకమందికి స్ఫూర్తి నిచ్చారు.

అటు తర్వాత రంగన్న తమ్ముళ్ళు, చెల్లెలు అందరూ మళ్ళీ కలిసారు. రంగన్న వాళ్లను, వాళ్ళ పిల్లల్ని ఎప్పటి మాదిరే ఆదరించాడు.

ముందుచూపు వెంగళప్ప!

చాలా రోజుల తర్వాత కలిసిన ప్రాణ మిత్రుడు టింగళప్పను చూసి వెంగళప్ప మూతి ముడుచుకున్నాడు.

వెంగళప్ప: నా పెళ్ళికి తప్పకుండా రమ్మని ఉత్తరం రాసాను కదా, నువ్వెందుకు రాలేదు?!

టింగళప్ప: అయ్యో! నాకు ఆ ఉత్తరం అందనే లేదు కదరా!

వెంగళప్ప: 'ఉత్తరం అందినా, అందకున్నా కూడా రావాల్సిందే' అని అంత పెద్ద అక్షరాలలో రాశాను కదరా, అయినా రాలేదు నువ్వు?!

మోసకారి పిల్లి కథ

కె. అనూష, ఎనిమిదవ తరగతి, కోగిర, రొద్దం మండలం, అనంతపురం జిల్లా.

అనగనగా ఒక అడవిలో ఒక పులి ఉండేది. ఒకరోజు అది ఆహారం కోసం బయలు దేరింది. దారిలో దానికి ఒక అడవి పిల్లి ఎదురైంది. ఆ అడవి పిల్లి కూడా చాలా ఆకలితో ఉంది. ఆహారం కోసం వెతుక్కుంటోంది.

అడవిపిల్లిని చూడగానే పులికి నోరూరింది. తటాలున దాని వెంటపడింది. “బాబోయ్! నా ఆకలి సంగతి సరే- ఈ పులికి ఆహారం మాత్రం కాకూడదు!” అనుకుంటూ అడవి పిల్లి తోచిన దిక్కుకు పరుగు తీసింది.

కనబడిన ఆహారాన్ని పులి ఊరికే ఎందుకు వదుల్తుంది? అది పిల్లి ఎటుపోతే అటు పోయింది. అడవిపిల్లికేమో ఆయాసం ఎక్కువైంది. 'ఎట్లా దేవుడా, దీన్నించి తప్పించుకోవటం?' అని అది అట్లానే

పరిగెత్తుతూ పరిగెత్తుతూ గబగబా ఓ చెట్టు పైకి ఎగ బ్రాకింది.

అంతకు ముందురోజే పులి కాలికి ఓ ముల్లు గుచ్చుకొని నొప్పి చేసి ఉన్నది. పరుగు పెట్టటమైతే ఎలాగో ఒకలాగా చేస్తున్నది కానీ, చెట్టుపైకి ఎగబ్రాకటం మటుకు ఇంకా వీలవట్లేదు దానికి. అందుకని అది గుర్రు గుర్రు మంటూ చెట్టు క్రిందే చక్కర్లు కొట్టటం మొదలుపెట్టింది.



ఆ చెట్టు కొమ్మ మీదే కోతి ఒకటి నిద్రపోతున్నది. అడవి పిల్లి రాకతో దానికి నిద్రాభంగమై కళ్లు తెరిచి చూసింది. అడవి పిల్లి గబుక్కున దాని కాళ్ళు పట్టుకొని "బాబ్బాబు! నన్ను కాపాడు!చెట్టు కిందే ఒక పులి నా కోసం కాచుకొని కూర్చుంది. కొద్ది సేపు ఆశ్రయం ఇవ్వు. నా ప్రాణాలు నీ చేతుల్లో ఉన్నాయి" అని ప్రాధేయపడింది.

కోతి పాపం మంచిది. అడవిపిల్లిని క్రిందికి తొయ్యకపోతే పులికి కోపం వస్తుందని దానికి తెలుసు. అయినా 'పిల్లి తనని కాపాడమని వేడుకున్నది గదా' అని అది 'సరే' అని తల ఊపి తిరిగి నిద్రలోకి జారుకుంది.

'అడవి పిల్లి ఎప్పటికైనా కిందికి దిగుతుంది; దాన్ని తను తినాలి' అని పంతం పట్టిన పులి ఆ రాత్రంతా చెట్టు కిందే కాపు కాసింది. తెల్లవారవస్తున్నా పులి కదలకపోయేసరికి అడవిపిల్లికి ఊపిరాడలేదు. 'ఎట్లా అయినా సరే, పులిని ఇక్కడినుండి పంపించెయ్యాలి' అని ఆలోచించటం మొదలుపెట్టింది.

చివరికి దానికో ఉపాయం తట్టి కోతి వైపు చూసింది. కోతి గాఢ నిద్రలో ఉంది. “ఈ

కోతిని కిందకు తోసేస్తే..? పులి దాన్ని తింటుంది; ఒకసారి కడుపు నిండిందంటే పులి ఇంక ఇక్కడ ఉండదు- వెళ్లిపోతుంది. అది తినగా కోతి మాంసాన్ని నేను కూడా తినొచ్చు.

నా ప్రాణాలను కాపాడుకున్నట్లూ ఉంటుంది; ఈ పూటకు నా కడుపు కూడా నిండుతుంది" అనుకున్నది మోసకారి పిల్లి. ఆ ఆలోచన వచ్చిందే తడవు కోతిని కిందకు తోసేసింది!

అయితే కోతి పడటం పడటం సరిగ్గా పులి నెత్తి మీద పడింది. ఆ బరువుకు పులికి తల తిరిగినట్లయింది. ఒక్క ఉదుటున లేచి బ్రతుకు జీవుడా అని అడవిలోకి పరుగు తీసింది. నిద్ర మత్తు వదిలిన కోతికి జరిగిందేమిటో అర్థమయ్యేందుకు ఒక్క నిముషం పట్టింది. అంతే- అది ఆవేశంగా చెట్టెక్కి, అడవి పిల్లి గూబ మీద ఒక్కటిచ్చింది.

గూబ గుయ్యిమన్న అడవి పిల్లి పట్టు తప్పి కింద పడింది. దాని నడ్డి విరిగింది; అయితేనేమి, 'పులి పారిపోయింది దేవుడా, అది చాలు. కోతి ఇచ్చిన బహుమానంతో నాకు మా బాగా బుద్ధొచ్చింది- ఇంక ఏనాడూ, ఎవ్వరినీ మోసం చెయ్యను..' అంటూ అది తన ఇంటికేసి పరుగు పెట్టింది!

పట్టుకోవడానికి వీలుకాని దేశం ఏది? జ. గ్రీస్

బుద్ధి వచ్చింది

బి. వి కోటేశ్వర రావు, 5 వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

తరగతిలోని పిల్లలందరికంటే కొంచెం పెద్దవాడు విజయ్; చాలా అల్లరి పిల్లాడు కూడా. ఆలోచన అనేదే లేకుండా ఎప్పుడూ ఏదో ఒక చిలిపి పని చేసి, ప్రమాదాలు కొని తెచ్చుకుంటూ ఉండేవాడు. టీచర్లు, పెద్దలు చేయద్దన్నదల్లా చేస్తూ ఉండేవాడు ఊరికే.

ఒకసారి ఆదివారం బడికి సెలవు. విజయ్‌కి వేరే పనేమీ లేక, 'ఏం చేద్దామా' అని ఆలోచించాడు. చేను దగ్గర బావి ఉంది. తనకి ఈత రాదు; అయినా "బావిలో రాళ్ళు వేస్తూంటే బలే ఉంటుంది" అనుకున్నాడు.

చేను కాడికి బయల్దేరాడు. పొలాల వెంబడి నడుచుకుంటూ పోతున్నాడు- దారిలో చెరువు గట్టున మర్రిచెట్టు ఒకటి కనిపించింది. దాని పేరే కోతుల మర్రి. దానినిండా ఎప్పుడూ వందల వందల

కోతులు ఉంటై. విజయ్‌కి వాటిని ఏడిపించాలని మనసైంది. ఇంకేముంది; నేలమీదున్న రాళ్ళను ఏరుకొని, వాటి మీదికి విసరటం మొదలెట్టాడు.

కోతులన్నీ 'గుర్రు గుర్రు' మన్నాయి. అన్నీ ఒకేసారి చెట్టుదిగి వాడి వెంట పడ్డాయి. “బాబోయ్ కాపాడండి! కాపాడండి!!" అంటూ విజయ్ పొలం గట్ల వెంట పరిగెత్తాడు.

అకస్మాత్తుగా వాడి కాలుని ఏదో చుట్టుకున్నట్లూ, కరిచినట్లూ అనిపించింది. 'పామే!' అనిపించింది వాడికి. “వామ్మో! పాము!" అని కేకలు పెడుతూనే పరుగు కొనసాగించాడు వాడు. దగ్గరలోనే పని చేసుకుంటున్న ముసలి రైతు ఒకడు ఆ పొలికేకలు విని గబగబా వచ్చాడు. పని చేస్తున్న కూలీలు కూడా పరుగున వచ్చారు.

వాళ్లలో ఒకాయన వెంటనే 108 కి ఫోన్ చేశాడు. ముసలాయనేమో తన కండువా చింపి విజయ్ తొడ క్రిందుగా గట్టి కట్టు కట్టాడు. అంతలో అంబులెన్సు వాళ్ళు రావటం, వాడిని దానిలోకి ఎక్కించి ఆసుపత్రికి తీసుకువెళ్లటం జరిగిపోయాయి.

అక్కడ డాక్టర్‌గారు గాయాన్ని గమనించి, అది పాము కాదని తేల్చారు. అయినా మంచిదే, ఇంజక్షన్లు వేసుకోవాలి అని వరసగా నాలుగైదు ఇంజక్షన్లు ఇచ్చారు. అవన్నీ అయినాక నీరసంగా ఇంటికొచ్చాడు విజయ్.

దాంతో బుద్ధి వచ్చినట్లుంది- విజయ్ కొంచెం పెద్దయ్యాడు: అల్లరి తగ్గించి ఇప్పుడిప్పుడే కొంచెంగా చదువులో పడ్డాడు!

పెద్దరికం

రచన: జి. వీరాంజనేయులు, 7 వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, కంకణాల పల్లి.

రామయ్య, రాంబాబు ఇద్దరూ రైతులు, దూరపు చుట్టాలు కూడా. రామయ్య కష్టజీవి. రాంబాబు ఎక్కడ వీలైతే అక్కడ అడ్డదారులు తొక్కే రకం.

రామయ్య ఇంట్లో ఏనాడో పెద్దలు చేయించి పెట్టిన ఎద్దుల బండి ఒకటి ఉంది. దాన్ని లాగేందుకు పెద్ద ఎద్దులు కొనాలని బలే కోరిక అతనికి. కానీ ఏనాడూ దానికి తగినంత డబ్బు సమకూరక, ఆ కోరిక అలాగే నిలచిపోయింది.

అయితే ఆ సంవత్సరం పంటలు కొంచెం బాగా పండేసరికి, కొంత రొక్కం చేతిలో

నిలచింది. దాంతో ఎద్దులను కొందామని ఆ కాసింత డబ్బూ పట్టుకొని సంబరంగా పట్నంలో జరిగే పశువుల సంతకు వెళ్లాడు రామయ్య.

సరిగ్గా అప్పుడే 'టోకరా వేసేందుకు ఏ గొర్రె దొరుకుతుందా' అని సంతలో ఎదురు చూస్తున్నాడు రాంబాబు.

రామయ్య చేతిలో డబ్బుని చూడగానే రాంబాబు కళ్ళు మెరిసాయి. సంతోషంగా దగ్గరికి వచ్చి "ఏంటి! బావా, ఇలా వచ్చావు?" అన్నాడు.

"గేదెను కొందామని వచ్చాను బావా! ఇంతకూ నువ్వు ఏంటి ఇక్కడ?" అన్నాడు రామయ్య. వెంటనే రాంబాబు ముఖం విచారంతో నిండిపోయింది: "మా అమ్మకు బాగాలేక పోతే ఇక్కడ హాస్పిటల్‌లో చేర్పించాను బావా! ఆపరేషన్ చేయాలంట. ఇరవై, ముప్పై వేల దాకా ఖర్చు అవుతుందని చెప్పారు. 'సంతలో ఐతే తెలిసిన వాళ్లు ఎవరైనా కనిపిస్తారు కదా' అని వచ్చాను. వాళ్ళేమైనా సాయం చేస్తే ఈ కష్టం గట్టెక్కుతుంది. పెద్ద ప్రాణం, పాపం!" అనేసాడు.

రామయ్య మనసు కరిగి నీరైపోయింది. "అయ్యయ్యో, అలాగా! ఇదిగో, ఈ డబ్బు ఉంచు. తరువాత నీకు వీలైనప్పుడు తిరిగి ఇద్దువు గాని. ముందు అమ్మకు ఆపరేషన్ చేయించు, పో బావా!" అని తన దగ్గరున్న డబ్బంతా ఇచ్చేసాడు.

రాంబాబు ఆ డబ్బు పుచ్చుకొని "బావా! ఎంత మంచి మనసు నీది! వీలైనంత తొందరలో తప్పకుండా నీ డబ్బు నీకు

ఇచ్చేస్తాను. నా పాలిట దేవుడివి నువ్వు!" అంటూ మాయం అయిపోయాడు.

నిజంగానే రాంబాబు వాళ్ల అమ్మకు ఆపరేషన్ అవసరం ఉండింది. అయితే అదేమంత పెద్దది కాదు. కొద్దిపాటి డబ్బుతో ఆ పని ముగించి, రాంబాబు ఇచ్చిన డబ్బులో అధికశాతం మిగుల్చుకున్నాడు రాంబాబు. ఆ డబ్బుతో వ్యవసాయం సాగించాడు; మంచి లాభాలే వచ్చాయి కూడా.

అయినా డబ్బు కళ్ళజూసే సరికి ఆశ పెరిగింది. రామయ్యకు ఇవ్వాల్సిన డబ్బు తిరిగి ఇవ్వనే లేదు! సంవత్సరం దాటాక కూడా రాంబాబు డబ్బు ప్రస్తావన ఎత్తకపోవటంతో, ఒకరోజు రామయ్య రాంబాబు ఇంటికే వెళ్లాడు నేరుగా. రాంబాబు కాస్త తడబడ్డాడు; కానీ, పైకి మటుకు నవ్వుతూ "రా బావా! రా! బాగున్నావా?! ఎన్నాళ్లయింది, నిన్ను చూసి!" అంటూ ఆహ్వానించాడు.

కాసేపు ఆ మాట, ఈ మాట మాట్లాడాక రామయ్య తనకు ఇవ్వాల్సిన డబ్బు గురించి అడిగాడు. "డబ్బా?! ఏం డబ్బు, బావా?!" అన్నాడు రాంబాబు, ప్రశ్నార్థకాన్ని ముఖమంతా నింపుకొని.

తను మోసపోయాడని ఆ క్షణాన్నే గుర్తించాడు రామయ్య. అయినా "ఆ.. హా..హా..ఏం లేదు..ఏం లేదు. నువ్వు కాదులే, వేరే ఎవరో ఇవ్వవలసి ఉన్నది. ఆ పని మీద వచ్చాను- వస్తాను" అనేసి బయటపడ్డాడు. ఏమంటే తను రాంబాబుకు డబ్బు ఇచ్చినట్లు సాక్ష్యం కూడా ఏమీ లేదు మరి!

తరువాతి ఏడాది పంట డబ్బుతో తనకు నచ్చిన ఎద్దులు కొన్నాడు; బండి కట్టాడు; అట్లా కొంత వృద్ధిలోకి కూడా వచ్చాడు రామయ్య.

అయితే ఉద్దరకు (తేరగా) వచ్చిన సొమ్ముతో బ్రతకటం అలవాటైన రాంబాబుకు వ్యవసాయం ఏమాత్రం గిట్టుబాటు కాలేదు. బాగా నష్టాలు వచ్చాయి. తిండి కూడా కరువైంది.

అతని మోసాలు కనుక్కున్న జనాలంతా "వామ్మో! వీడు మామూలు వాడు కాదు! వీడికి దగ్గరైతే అంతే సంగతులు!" అనుకున్నారు; ఇంక ఎవ్వరూ ఒక్క రూపాయి కూడా అప్పు ఇవ్వలేదు.

చివరి ప్రయత్నంగా రామయ్యని కలిసిన రాంబాబు కళ్ళలో నీళ్ళు తన్నుకు వచ్చాయి. "నన్ను క్షమించు బావా! నా మోసాలకు తగిన బుద్ధి చెప్పాడు దేవుడు" అంటూ రామయ్య కాళ్ల మీద పడ్డాడు.

రామయ్య అతన్ని ఓదార్చుతూ "లేలే, రాంబాబూ! కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నీకు నేను ఇచ్చిన డబ్బులతో ఎద్దులు కొందామనుకున్నాను. ఆ ఏడాది వీలవ్వలేదు-కానీ మరుసటి ఏడాదికి అవి సమకూరినైగదా! అట్లా అవుతుంటుందంతే. మనకంటూ ఏలాంటి అప్పులూ మిగలకుండా బ్రతకటంలో పరమార్థం ఉంది. ప్రస్తుతానికి నేను నీకు ఇంకొంత సాయం చేస్తాను- నీ వీలును బట్టి మొత్తంగా తీర్చేందుకు ప్రయత్నించు" అని మరి కొంత డబ్బును అతని చేతిలో పెట్టి పంపాడు.

దాంతో రాంబాబు మనసు నిజంగానే మారింది. అటుపైన మోసాలు చేయడం ఆపేశాడు. రెండేళ్లలో వడ్డీతో సహా రామయ్య డబ్బును రామయ్యకు ఇచ్చేసాడు. బుద్ధిగా నడుచుకుంటూ తనపై ఉన్న మచ్చను పోగొట్టుకున్నాడు. 'మంచివాడు' అనిపించుకున్నాడు.

మూడు సలహాలు

సేకరణ: డి.పుష్ప, ఎనిమిదవ తరగతి, zphs, సి.కె.పల్లి. అనంతపురం జిల్లా.

అనగనగా ఒక ఊరిలో ఒక అడవి ఉండేది. ఆ అడవికి వెళ్ళాడొక వేటగాడు. వాడు ఆ అడవి మధ్యలో వల వేశాడు. ఆ వలలోకి ఏ జంతువులో, పక్షులో వచ్చి పడతాయని ఎదురు చూస్తూ చెట్టు క్రింద కూర్చున్నాడు. చూస్తుండగానే ఓ బుజ్జి పిట్ట మెల్లగా వచ్చి వలలో చిక్కుకున్నది.

వేటగాడు లేచి వల దగ్గరికి వచ్చాడు. బుజ్జి పిట్టను చేతిలోకి తీసుకొని "ఆహా! భలే రుచిగా ఉంటుంది!" అంటూ బుజ్జి పిట్టను చంపి తిందామని ప్రయత్నించాడు.

బుజ్జి పిట్టకు భయం వేసిందిగానీ, చటుక్కున తేరుకొని ధైర్యంగా మాట్లాడింది: "వేటగాడా! నన్ను తిన్నంత మాత్రాన నీ కడుపు నిండుతుందా? నీ కడుపు నిండదు; నీ ఆకలీ తీరదు. నన్ను వదిలేయ్- నీకు

అమూల్యమైన సలహాలు మూడు ఇస్తాను. మొదటి సలహాను నీ చేతి మీద కూర్చొని ఇస్తాను. రెండవ సలహాను దూరంగా నేలమీద కూర్చొని ఇస్తాను. మూడవ సలహాను చెట్టు కొమ్మ మీద కూర్చొని ఇస్తాను" అన్నది.

వేటగాడు కొద్ది సేపు ఆలోచించాడు- 'సరేలే' అని దాన్ని వదిలేసాడు.

బుజ్జి పిట్ట వేటగాడి చేతిమీదే కూర్చొని మొదటి సలహా ఇచ్చింది: "అసంభవమైన వాటిని ఎప్పుడూ నమ్మవద్దు" అని.

వేటగాడు ఇంకా ఆలోచిస్తుండగానే బుజ్జి పిట్ట దూరంగా వెళ్లి కూర్చొని రెండవ సలహా ఇచ్చింది: "జరిగి పోయిన దాన్ని గురించి ఎన్నడూ బాధపడవద్దు" అని.

ఆ వెంటనే మూడవ సలహా ఇచ్చేందుకు చెట్టు కొమ్మ మీదికి ఎగిరింది: "నా కడుపులో కిలో బంగారం ఉంది.

ఆ బంగారాన్ని నువ్వు గనక తీసుకొని ఉంటే పది తరాల పాటు కాలు మీద కాలు వేసుకొని దర్జాగా బ్రతికేవాడివి" అన్నది బుజ్జి పిట్ట.

వేటగాడు నిర్ఘాంత పోయాడు. నేను నిన్ను నమ్మి వదిలాను. బుజ్జి పిట్టా! నువ్వు నన్ను మోసం చేశావు" అని ఏడుపు ముఖం పెట్టాడు.

బుజ్జి పిట్ట నవ్వింది. “చూడు, నా సలహాలు నువ్వసలు పట్టించుకున్నట్టే లేవు. అసంభవమైనవాటిని నమ్మద్దని చెప్పాను కదా, మరి పిట్ట కడుపులో బంగారం

ఉందంటే నువ్వు ఎలా నమ్మావు? ఇక నా కడుపులో నిజంగానే కిలో బంగారం ఉండి ఉంటే, నువ్వు నన్ను పట్టుకున్నప్పుడు ఆ బరువు తెలిసేది కదా? అయినా నా కడుపులో కిలో బంగారం పట్టేనా?" అన్నది.

వేటగాడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

పిట్ట కొనసాగించింది: "చూడు, జరిగిపోయినదాన్ని గురించి ఎన్నడూ బాధపడకు" అని చెప్పాను. నువ్విప్పుడు ఏం చేస్తున్నావు? 'అనవసరంగా నన్ను వదిలేసానే' అని బాధపడుతున్నావు. కదూ?" అన్నది నవ్వుతూ.

వేటగాడికి మరింత సిగ్గు వేసింది. "నిజమే.

ఇక మీద నీ సలహాలు పాటిస్తాను. మరిప్పుడు మూడో సలహా కూడా ఇవ్వు" అని అడిగాడు.

"ఎవరు ఏ సలహాలను ఇచ్చినా, మనకు వాటిని పాటించే గట్టి మనసు ఉంటేనే ప్రయోజనం. సలహాలు ఆచరణలోకి వస్తేనే ఉపయోగం- అర్థమైందా?" అని చెప్పి బుజ్జి పిట్ట తుర్రుమని ఎగిరిపోయింది.

ఇది మాత్రం చూడద్దు!

ముఖేష్: నాన్నా మీరు చూడకుండా ఏ పనైనా చేయగలరు కదా ?

నాన్న: అవును. ఏం?

ముఖేష్: ఏం లేదు నాన్నగారూ! కళ్ళు మూసుకొని ఈ ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం పెట్టగలరేమో చూడండి! మా స్నేహితులంతా అది వీలు కాదంటున్నారు..

మీ పుస్తకాలకోసం లేబుల్స్

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

కొత్తపల్లి

పేరు: _____

తరగతి:_____సెక్షన్:_____

స్కూల్:_____

సబ్జెక్టు:_____

పదాల్ని వెతికి పట్టుకోండి!

మొక్కలు, ఆలస్యం, హృదయం, బెజవాడ, స్నేహితులు, వందనాలు, కృతజ్ఞత, జీవితం, రాము, గొడుగు, ఆహారం, రాజుగారు, చదరంగం, కూరగాయలు, సహాయం, ఆసుపత్రి, జీవనం, రాణి మదనపల్లి, కోన :- *ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి-నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రింది నుండి పైకి -ఎటుపడితే అటు! వాటిని వెతికి వాటి చుట్టూ గుండ్రాలు గీయండి!*

ఆ	జూ	రు	ద	యం	హా	స	హి	బె	న	కో	వం
జ్ఞ	యం	స్నే	ఆ	హా	ఆ	రు	రా	హి	వా	డ	స్నే
చ	తం	ల్లి	ర	ల	స	జీ	జు	ము	జ	హి	ద
హా	వి	ప	చ	స	స్యం	వ	గా	బె	తు	హ్మా	నా
రం	జీ	న	ద	కో	చ	రా	రు	లు	స్నే	య	లు
కూ	త్రి	ద	రం	మొ	క్క	లు	హృ	వ	జీ	ర	గు
ల్లి	లు	మ	గం	ల్లి	లో	న	రా	త	వ	డ	డు
ఆ	హ్మా	జ్ఞ	యం	రా	ము	జ్ఞ	క్ప	కూ	నం	వా	గొ
సు	ద	గం	ణి	మ	ద	ల్లి	హృ	త	త	జ	జ్ఞ
ప	యం	గా	రం	హా	ఆ	డు	పి	రా	జ్ఞ	బె	వ
త్రి	ఆ	చు	రా	లు	నా	ద	వం	లి	త	త	నం
డు	రం	లు	లు	య	గా	ర	కూ	జ	ము	క్ప	ము

భారవి

శ్లోక చమత్కారం

'సహసా విదధీత న క్రియాం ' ('ఆలోచించకుండా ఏ పనీ చేయద్దు') అని నానుడి. అది చెప్పిన భారవి కథలు అన్నమాట, ఇవి !

సేకరణ, కథనం : ఇ యన్ వి రవి, అనంతపురం.

పూర్వం అచలపురం అనే గ్రామంలో నారాయణస్వామి అనే పండితుడు ఒకడు ఉండేవాడు. ఆయన కొడుకు పేరు భారవి. భారవి బాగా చదువుకుని పెద్దవాడయ్యాడు. అతనికిప్పుడు పద్దెనిమిదేళ్ళు.

పద్దెనిమిదేళ్ళ భారవి - చక్కని పాండిత్యంతో కూడిన కవిత్వం చెప్పేవాడు. తెలిసిన వాళ్ళంతా అతని కవిత్వాన్ని తెగ మెచ్చుకునే వాళ్ళు. అయితే భారవి వాళ్ళ నాన్న నారాయణస్వామి కొడుకు పాండిత్యానికి

లోలోన సంతోషపడినా, పైకి మాత్రం మెచ్చుకునేవాడు కాదు. భారవికి ఇది కాస్తంత అసంతృప్తిగా ఉండేది.

ఒకసారి భారవి ప్రజలందరి సమక్షంలో కవిత్వం చెప్పాడు. అతని కవిత్వం అక్కడ చేరిన ప్రజలందరినీ బలే మెప్పించింది. దాంతో భారవి ఖ్యాతి చుట్టుపక్కల ఊళ్ళన్నిటికీ వ్యాపించింది. భారవి తండ్రికి ఆప్తులైనవాళ్ళు, బంధువులూ కూడా చాలామంది ఆ ప్రశంసను విన్నారు.

తర్వాత కొన్నాళ్లకు ఏదో సందర్భంలో బంధువులు చాలామంది నారాయణస్వామి ఇంటికి వచ్చారు. వాళ్ళంతా భారవిని మెచ్చుకుంటూ, నారాయణస్వామితో "మీవాడు చాలా గొప్ప కవిత్వం చెబుతున్నాడు నారాయణస్వామీ!" అన్నారు.

దానికి నారాయణస్వామి నాలుక చప్పరించేస్తూ "అబ్బే, అదేమి కవిత్వం, వాడి చదువు ఇంకా పూర్తే కాలేదు! ఏదో రాస్తుంటాడంటే- అంతగా పొగడాల్సిన కవిత్వమేమీ కాదది" అని తీసిపారేసినట్లు మాట్లాడాడు.

పక్కనే ఉండి ఆ మాటలు విన్న భారవి కోపం పట్టలేకపోయాడు. ఆ కోపంలో అతని విచక్షణా జ్ఞానం పూర్తిగా నశించింది. లోకమంతా మెచ్చినా తనను విమర్శిస్తున్న తండ్రిని, ఎలాగైనా సరే- వదిలించుకోకపోతే శాంతి లేదనుకున్నాడు. ఆయన్ని గుండ్రాయితో మోది చంపేయాలని పథకం వేసాడు. గబగబా ఇంటిలోకి వెళ్ళాడు. పెద్ద గుండ్రాయిని ఒకదాన్ని తీసుకొని, భోజనాల గదిలో అటకపైకెక్కి కూర్చున్నాడు: తండ్రి కోసం ఎదురు చూస్తూ.

రాత్రికి నారాయణస్వామి భోజనానికి

కూర్చున్నాడు. అటక మీద ఉన్న భారవి గుండ్రాయిని క్రిందికి దొర్లించేందుకు సిద్ధమౌతున్నాడు. సరిగ్గా ఆ సమయంలో భోజనం వడ్డిస్తున్న భారవి తల్లి, నారాయణస్వామితో అన్నది- "కొడుకుని అందరూ పొగుడుతుంటే, మీరు కనీసం ఒక్క మంచిమాట కూడా అనరెందుకు? వాడు యువకుడైనాడు కూడా, పాపం వాడి మనసు నొచ్చుకోదా?" అని.

నారాయణస్వామి అన్నం కలుపుకుంటూ "పిచ్చిదానా! మన భారవి నిజంగా 'భా రవి' (ప్రకాశించే సూర్యుడు). వాడు మనందరికీ పేరు తీసుకొచ్చే రోజు ముందుంది. ఇప్పుడే పొగడ్తలకు అలవాటు పడితే వాడి ప్రగతి ఆగిపోతుంది" అని బదులిచ్చాడు.

అటకమీది నుండి వింటున్న భారవి సిగ్గుతో కుమిలిపోయాడు. అటక దిగి వచ్చి తండ్రి పాదాలమీద పడి, జరిగిందంతా చెప్పి, "ప్రాయశ్చిత్తంగా నాకేదైనా శిక్ష విధించండి" అని వేడుకున్నాడు.

"ఓ ఆరునెలలు అత్తవారింట్లో గడిపి రా! అయితే నువ్వు ఎన్నాళ్ళు అక్కడ ఉండబోతున్నదీ మటుకు చెప్పకూడదు వాళ్ళకు" అన్నాడు నారాయణస్వామి.

'సరే- ఇదేమి శిక్ష?! అత్తవారింట్లో పండగ చేసుకొని వస్తాను ఆరు నెలలు' అని భారవి భార్యను వెంటబెట్టుకొని అత్తవారింటికి వెళ్ళాడు. 'కూతురు-అల్లుడు వచ్చారు!' అని సంతోషపడిన అత్తవారు ఓ రెండు మూడు రోజుల పాటు గొప్ప మర్యాదలు చేసారు.

అయితే తిరిగి వెళ్ళే ముచ్చట ఎత్తట్లేదు అల్లుడు. మూడో రోజుకు 'ఇలా ఊడి పడ్డాడేంటి?' అనుకున్నారు అత్తవారు. ఓ వారం తిరిగేసరికి 'వీడేంటి, ఇక్కడే తిష్ట వేశాడు?' అనుకున్నారు. భారవికి ఆదరణ తగ్గింది. ఆపైన అత్తవారింట్లో అందరూ అతనికి పనులు చెప్పటం సాగించారు. నెల గడిచేసరికి అతన్ని పశువుల కొట్టంలో వాటికి తోడుగా పడుకొమ్మన్నారు. పశువులను కడగటం, మేపటం వంటి పనులు అప్పజెప్పారు. మిగిలిపోయిన భోజనం

పెట్టసాగారు.

ఇదంతా సహిస్తూ గడువుకోసం ఎదురు చూస్తూ పోయాడు భారవి. ఆర్నెల్ల గడువూ పూర్తి అయ్యిందో లేదో, భార్యాభర్తలిద్దరూ అక్కడినుండి సెలవు పుచ్చుకొని ఇల్లు చేరుకున్నారు. అయితే ఈ ఆరు నెలల్లోనూ భారవికి లోకం తీరు తెలిసి వచ్చింది. కవిగా ఆయన ఎదిగేందుకు ఇది చాలా ఉపయోగపడింది అని చెబుతారు.

ఆ తర్వాత ఓ మారు భారవి భార్య కళ్ళనీరు పెట్టుకుంటూ, చినిగిన చీరను భర్తకు చూపించింది. భారవి ఆమెను ఊరడించి, తాటాకుపై ఓ శ్లోకం వ్రాసి ఇచ్చి, 'ఊళ్ళో ధనవంతుడికి అమ్మి డబ్బు తెచ్చుకో' అన్నాడు.

భారవి భార్య ఆ శ్లోకాన్ని పట్టుకెళ్ళి ఊర్లో శ్రేష్టికి ఇచ్చింది. శ్రేష్టి ఆ శ్లోకాన్ని చదువుకుని ముచ్చటపడి, కొంత డబ్బు ఇచ్చి పంపాడు. ఆపైన దాన్ని కత్తి ఒరలో పెట్టి, ఆ కత్తిని ఒరతో సహా గోడకు వేలాడదీసాడు. అటుపైన పనులలో పడి ఆ సంగతిని మర్చిపోయాడు.

నిజానికి ఆ శ్రేష్ఠి పనిమీద దేశాంతరం వెళుతున్నాడు. ఒకటి రెండు రోజుల తర్వాత భార్యను, ఐదేళ్ళ కుమారుణ్ణి వదిలి ద్వీపాంతరం వెళ్ళిపోయాడు. అలా వెళ్ళిపోయినవాడు మళ్ళీ పదకొండేళ్ళకు కానీ తిరిగి రాలేదు.

ఓ శుభముహూర్తాన ఇంటికి తిరిగి వచ్చిన శ్రేష్టి, భార్య మంచం మీద ఓ యువకుడు పడుకుని ఉండటం చూసాడు. 'తన ఇంట్లో పడుకున్నాడు, వీడెవడు?' అన్న ఆనుమానం అతన్ని దహించి వేసింది. ఆవేశం పట్టలేక గోడకు వేలాడుతున్న కత్తి దూశాడు. ఆ కత్తి ఒర నుండి ఓ తాటాకు ప్రతి రాలి పడింది. అందులో ఇలా వ్రాసి ఉన్నది:

సహసా విదధీత న క్రియాం
అవివేకః పరమాపదాం పదమ్ |
వృణుతే హి విమృశ్యకారిణం
గుణలుబ్ధాః స్వయమేవ సంపదాః ||

తొందరపాటుతో చేసేపని ఆపదలకు కారణమవుతుంది, అందుకని ఒక పని చేసేప్పుడు, చక్కగా పూర్వాపరాలు ఆలోచించి చెయ్యాలి. అలాంటి ఆలోచనాపరునికి సంపదలు తంతట తామే వచ్చి చేరతాయి.

శ్లోకం చదివిన శ్రేష్ఠి ఆగి, ఒక్క క్షణం ఆలోచించాడు. "మంచం మీద పడుకున్న యువకుడు వేరే ఎవ్వరో కారు- తన కొడుకే! తను వెళ్ళేటప్పుడు వాడు చిన్నవాడు. ఇన్నేళ్ళు గడిచాక ఇంకా చిన్నగా ఎందుకుంటాడు?!" అని అర్థమైంది.

అంతలోనే అక్కడికి వచ్చింది భార్య. శ్రేష్ఠిని చూసి మురిసిపోయింది. ఆ హడావిడికి నిద్రలేచిన కొడుకు తండ్రి చెంత చేరాడు. శ్రేష్ఠి ఇద్దరినీ అక్కున పొదవుకున్నాడు. 'ఈ శ్లోకం నా కుటుంబాన్ని నిలిపింది. ఇది లేకపోతే నా బ్రతుకు ఏమయ్యేది?' అనుకున్నాడు.

ఆ శ్లోకాన్ని తనకు ఇచ్చిన వ్యక్తి కోసం వెతికించాడు. భారవిని కనుక్కుని అతణ్ణి ఘనంగా సన్మానించాడు.

ఆ సరికి భారవి కీర్తిప్రతిష్ఠలు దేశమంతా వ్యాపించాయి.

తను రచించిన 'కిరాతార్జునీయమ్' అనే కావ్యంలో ఈ శ్లోకానికి తావు కల్పించాడు భారవి.

చెన్నయ్య ఆదర్శం

రచన: మద్దిరాల శ్రీనివాసులు, ప్రాథమికోన్నత పాఠశాల, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

చెన్నయ్యకు తల్లి, తండ్రి అంటే అపారమైన గౌరవం. అలాగే చదువంటే కూడా చాలా ఇష్టం. చక్కగా చదివేవాడు. ఊళ్ళో ఉన్న బడిలో ఐదో తరగతి పూర్తి చేశాడు. పై తరగతులకు వేరే ఊరికి వెళ్ళాలి. కానీ తండ్రి ఒద్దనేసాడు.

దాంతో ఇక పన్నెండేళ్ళ చెన్నయ్య బర్రెలు కాయటంలో పడ్డాడు. అప్పుడప్పుడూ మిద్దె పనులకనీ, కూలీకనీ పోయేవాడు, తండ్రితోబాటు. ఒక్కోసారి వాళ్ళ నాన్న ఏదైనా పనిమీద పట్నానికి పంపితే, అప్పుడు బళ్లో సార్లు చెప్పిన మాటలన్నీ గుర్తు చేసుకునేవాడు. అలవాటుగా రోజూ క్రమం తప్పకుండా ఒక కథో, ఒక వార్తో చదువుతూ

ఉండేవాడు.

అతనికి పద్దెనిమిదేళ్ళు వచ్చే సరికి వాళ్ళ అమ్మానాన్నలు పెళ్ళి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. "అయ్యో! ఇప్పుడే పెళ్లి ఏంటి నాన్నా" అన్నాడు చెన్నయ్య కంగారుగా. "అవునురా! ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? నెలకు ఇంత కూలి సంపాదిస్తున్నావు- నీకేంటి? అయినా ఇప్పుడు కాకపోతే మేము ముసలోళ్లం అయ్యాక చేసుకుంటావా?" అని ఎగిరారు తల్లిదండ్రులు. చెన్నయ్య మారు మాటాడలేదు.

చెన్నయ్య భార్య లక్ష్మి మంచిది. అణకువ గలది. కానీ ఏమంటే ఆమెది రెండో తరగతి చదువు! రెండేళ్ళు తిరిగేసరికల్లా వాళ్లకు ఒక కూతురు పుట్టింది. పేరు ప్రియ. అమ్మాయి పుట్టినందుకు చెన్నయ్య తల్లి దండ్రులు, అత్త మామలు చాలా బాధపడ్డారు. “ఈసారి కొడుకే పుట్టాలి” అన్నారు. కానీ తన జీవితంలో మొదటిసారి, చెన్నయ్య తన నిర్ణయం తను తీసుకున్నాడు: ఎవరు ఏం చెప్పినా వినలేదు. వెళ్ళి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాడు! "ఊరికే అల్లరి చేయద్దండి. నేను సంపాదించే ఈ కాసిని డబ్బులతో ఇల్లు ఎలా గడుస్తుందనుకుంటున్నారు? కొడుకైనా, కూతురైనా ఒక్కరే చాలు!” అని గట్టిగా చెప్పేసాడు.

కాలం గడిచింది. ప్రియకు బడి వయసు వచ్చింది. బడిలో చేర్చాడు చెన్నయ్య:

'నాకు ఎలాగూ చదువులేదు. కాబట్టి, ఎలాగైనా నా కూతురిని చదివించాలి. ఎంత కష్టపడైనా సరే, ప్రియను పెద్ద చదువు చదివిస్తాను" అనుకునేవాడు.

కానీ, ప్రియను చదివించటం ఇంట్లో పెద్దవాళ్లెవ్వరికీ ఇష్టం లేదు. "ఆడపిల్లకు చదువు ఎందుకురా? పోనీ ఇంకో పిల్లోడన్నా పుడతాడంటే, అదీ లేకపాయె!" అంటూ గొణిగేవాళ్ళు. ప్రియ ఐదవ తరగతి మంచి మార్కులతో పాసయ్యింది. చెన్నయ్య ఆ పాపను పట్నం హైస్కూల్లో చేరుస్తానన్నాడు. తండ్రి ఒప్పుకోలేదు. కానీ, చెన్నయ్య "నాన్నా! నన్ను నువ్వు ఎలాగూ చదువుకోనీయలేదు. నీకేం తెలుసు నాన్నా, చదువు విలువ?! ఆరోజు నీకు ఎదురు చెప్పటం ఇష్టం లేక, చదువు మానుకున్నా. సార్లు చెప్పింది వినలేదా- "పిల్లలు బడికి- పెద్దలు పనికి!" అని? పనులు చేసేందుకు ఇంట్లో మనం నలుగురం పెద్దవాళ్లం ఉన్నాం. ఇదిగో, ఇప్పుడు చెబుతున్నా- ఎవరు ఔనన్నా, కాదన్నా నా కూతురిని మాత్రం చదివించి తీరుతా. ఈ విషయంలో నేనింక ఎవ్వరి మాటా వినదలచుకోలేదు" అంటూ ఎంత కోపంగా అరిచాడంటే, ఇక ఆపైన ఎవ్వరూ మాట్లాడలేదు.

ప్రియ పదవ తరగతి పాసైంది. మంచి మార్కులు కూడా వచ్చాయి. "మన ప్రియకి ఫస్ట్ మార్కంట. అంతే కాదు, గవర్నమెంటు కాలేజీలో సీటు కూడ్ ఫ్రీ అంట.." అని చెన్నయ్య సంతోషంగా చెబితే "చాల్లే, సంబడం" అంటూ పెదవి విరిచి, అమ్మా, నాన్నా లోపలికి వెళ్లిపోయారు.

అటుపైన ప్రియను ప్రభుత్వమే ఉచితంగా ఇంజనీరింగ్ చదివించింది. దారి ఖర్చులకు తప్ప, ప్రియ చదువుకంటూ పెద్దగా ఖర్చు చేయవలసిన అవసరమే రాలేదు చెన్నయ్యకు!

ఆ సరికి అతని తల్లిదండ్రులు ముసలి వాళ్లు అయిపోయారు. అయినా వాళ్ళు, ఊళ్ళో జనాలు అంతా చెన్నయ్యను పిచ్చోడిలాగానే చూసేవాళ్ళు: "వీడో పిచ్చోడు. ఆడ పిల్లకు చదువంట! ఏడ్చినట్టే ఉంది!" అని

గొణుక్కునేవారు.

చూస్తూండగానే ప్రియ చదువు పూర్తయింది. మంచి మార్కులతో పాసయిన ప్రియకు వెంటనే ప్రభుత్వ ఉద్యోగం కూడా వచ్చింది. ప్రభుత్వంవారు ఆమెకు ప్రత్యేకంగా కారు కూడా ఇచ్చారు! ఊర్లోకి కారులో వచ్చిన ప్రియను చూసి అందరూ ముక్కున వేలేసుకున్నారు. మనసులో "అబ్బా!" అనుకున్నా, బయటికి మటుకు ఏమీ మాట్లాడలేదు.

మరో రెండేళ్ల తరువాత, ఊర్లోకి ఎవరో కోటీశ్వరులు- పెద్ద కారు వేసుకొని వచ్చారు. చేతుల నిండా బంగారు గాజులు, ఒంటినిండా బంగారం, పట్టు చీరతో మెరిసిపోతున్నది కారులో ఉన్న పెద్దావిడ. ఆమె భర్త పెద్ద పెద్ద మీసాలు పెట్టుకొని రాజసంగా ఉన్నాడు. ఆయన ఒక్కో వేలుకూ ఒక్కో రకం ఉంగరం మెరుస్తోంది. "ఇక్కడ రామయ్యగారి అబ్బాయి చెన్నయ్య అంటే ఎవరండీ? వాళ్ళ అమ్మాయి ఇంజనీరు-" అంటూ ఎంక్వయిరీ చేసుకుంటూ వచ్చారు.

అందరూ "ఏంటబ్బా? ఎందుకు అడుగుతున్నారు? బిడ్డను చదివించాడుగా, ఏదో! ఆ పాప ఏదో చేసి ఉంటది. గొప్పోళ్లతో పెట్టుకుంటే అలాగే ఉంటది మరి. ఇప్పుడు వీడికి పోయే కాలం వచ్చింది. అయినా ఏం జరిగిందో చూద్దాం" అనుకుంటూ ఊరి జనాలు కొందరు కారు వెనకాలనే పడి వచ్చారు చెన్నయ్య ఇంటికి.

"అయ్యా! కూర్చోండి" అని మంచం వాల్చాడు చెన్నయ్య- మజ్జిగ తెమ్మని భార్యకు పురమాయిస్తూ. "చెప్పండయ్యా" అన్నాడు బెరుకు బెరుగ్గానే.

"ఇంజనీరు ప్రియ..మీ అమ్మాయేనా?!" అడిగాడు కోటీశ్వరుడు.

"అవునండయా"

"కంగారు పడకండి- నా పేరు జానకి రామయ్య. ఈమె నా భార్య, సీత. మాకు ఒక్కగానొక్క కొడుకు, రవి. మీ అమ్మాయిదీ, మా అబ్బాయిదీ ఒకే ఆఫీసు " చెప్పాడు కోటీశ్వరుడు.

"అనుకున్నా. ఏదో జరిగి ఉంటుందని!" ఊర్లో వాళ్లలో గుసగుసలు మొదలయ్యాయి. విన్న చెన్నయ్యకు భయం పెరిగింది-

కోటీశ్వరుడు కొనసాగించాడు. "చెన్నయ్యగారూ! మాకు దాదాపు ఒక ఐదు కోట్ల పైనే ఆస్తులు ఉన్నాయి. మీ అమ్మాయిని మేం చూసాం. మా అబ్బాయికి తగిన పిల్ల అనిపించింది. ఇదిగో, మావాడి ఫొటో తీసుకొచ్చాం. మీ అమ్మాయి తెలివితేటలు, పని సామర్థ్యం, మంచితనం ఇవన్నీ మావాడికి కూడా చాలా నచ్చాయి. ఇప్పుడు మిమ్మల్ని ఆ విషయం అడగడానికే వచ్చాము. మీ అమ్మాయిని అడిగితే, 'అంతా మా అమ్మానాన్నల ఇష్టం' అన్నది. వెంటనే బయలుదేరి ఇలా వచ్చాం!" అన్నాడు కోటీశ్వరుడు.

ఈ మాట వినగానే ఊర్లో వాళ్లంతా నోర్లు వెళ్లబెట్టారు. ముసలి రామయ్యకు ఏడుపొచ్చింది. చెన్నయ్యకు, లక్ష్మికి అసలు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

కొద్దిసేపటికి ఆనందబాష్పాలను తుడుచుకుంటూ- "రేపు పండక్కి అమ్మాయి వస్తుంది; దానితో ఒక మాట మాట్లాడి-" చిన్నగా అన్నాడు చెన్నయ్య.

"ఓఁ అలాగే! ఏ ఇబ్బందీ లేదు. నిదానంగానే అన్నీ ఆలోచించుకొని చెప్పండి. మా ఇల్లు, ఫోన్ నెంబరు అన్నీ అమ్మాయికి ఇచ్చి వచ్చాం... మరి వెళ్లొస్తాం" అని లేచారు.

కారు బయలుదేరి వెళ్లింది.

రామయ్య ఉబ్బితబ్బవుతూ "ఒరే! చెన్నా! ఏమోననుకున్నా గానీ, మన ప్రియమ్మను చదివించి మంచిపని చేసావురా! ఇదంతా దాని చదువు వల్లే!" అంటూ కొడుకును పట్టుకొని కన్నీరు కార్చాడు.

ప్రియ పెళ్లి ఊళ్ళోనే, వైభవంగా జరిగింది. ఖర్చంతా మగ పెళ్లివారే పెట్టుకున్నారు. ఎన్నడూ కనీ, వినీ ఎరుగని రీతిలో భోజనాలు చేశారు. ఊర్లో ఒక్కరిని కూడా పోనీయకుండా చెన్నయ్య అందరినీ భోజనాలు చేసేంతవరకూ ఇంటింటికీ తిరుగుతూనే ఉన్నాడు.

"మీ కుటుంబం అంతా మాతో బాటు నగరానికి వచ్చెయ్యండి" అని బలవంతం చేసిన అల్లుడితో చెన్నయ్య "ఒద్దులే బాబూ! అందరూ ఉన్న ఊరిని వదిలి వెళ్తే ఎలా? మీరు కుర్రవాళ్లు; అవకాశం ఉన్నవాళ్లు. అంతగా మేలు చేయాలనుకుంటే ఓ పని చేయండి: ఈ ఊర్లో పెద్ద బడి ఒకటి కట్టించండి. అందరూ వేరే ఊరికి వెళ్ళి పై చదువులు చదవలేకపోతున్నారు కదా" అన్నాడు.

ఆ విధంగా చెన్నయ్య సలహా మేరకు, ప్రియ వాళ్ల కృషి ఫలితంగా ఊళ్లో ఉన్న చిన్న బడి కాస్తా మరో చోట- ఆరు ఎకరాల స్థలంలోకి- వెళ్లింది. వసతులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం స్పందించటం వల్ల అక్కడ హైస్కూలు కూడా ఏర్పడింది.

ఇప్పుడు ఊళ్లో అందరికీ చెన్నయ్య, ప్రియలు ఆదర్శం!

"పెద్దలంతా పనికి. పిల్లలంతా బడికి

ఎటువైపో చెప్పు!

టీచర్: బోర్డు మీద యాభై అయిదు రాసి చూపించు చింటూ! 5 ప్రక్కన 5 రాస్తే సరిపోతుంది కదా?!

బోర్డు మీద ఒక 5 వేసి ఆలోచించటం మొదలెట్టాడు చింటూ.

టీచర్: ఏం ఆలోచిస్తున్నావ్ చింటూ?! చెప్పాగా, ఎట్లా రాయాలో?!

చింటు: అదే సర్! రెండో ఐదును మొదటి ఐదుకు ఏ వైపున రాయాలా అని చూస్తున్నాను...

మహాకాలుని గాథ

బౌద్ధ కథ

అనుసరణ: నారాయణ

బుద్ధుడు జీవించి ఉన్న కాలంలో సేతవ్యం అనే పట్టణం ఒకటి ఉండేది. చూలకాలుడు, మహాకాలుడు అనే ఇద్దరు సోదరులు ఆ పట్టణ పరిసరాలలో వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు.

ఒకనాడు వాళ్లిద్దరూ సరుకులు తీసుకొని వస్తూ ఉండగా దారిలో ఒక గ్రామంలో చాలా మంది ఒకచోట గుమిగూడి ఉండటం కనిపించింది. సోదరులు ఇద్దరూ ఉత్సుకత కొద్దీ అక్కడికి వెళ్లి చూసారు:

ఆ సమయంలో బుద్ధుడు అక్కడ ప్రవచనం ఇస్తున్నాడు: "ఈ శరీరం, ఇంద్రియాలు,

మనస్సు- అన్నీ క్షణికాలే! అన్నీ నశించేవే! భావనలు అన్నీ అనిత్యాలే!!" అని తార్కికంగా, అందరికీ అర్థమయ్యేట్లు వివరిస్తున్నాడు బుద్ధుడు. ఆ ప్రవచనం మహాకాళుడిని లోతుగా కదిలించింది.

ప్రవచనం పూర్తయ్యేసరికి మహాకాలుడు బుద్ధుడిని చేరుకొని, తనను కూడా శిష్యునిగా స్వీకరించమని వేడుకున్నాడు. చూలకాలుడు అతనిని వారించేందుకు చాలా ప్రయత్నించాడు. 'లాభదాయకమైన వ్యాపారాన్ని వదులుకోవడం ఎందుకు?' అని అనేక విధాలుగా చెప్పి చూసాడు. అయినా మహాకాలుడు తన పట్టు వీడలేదు. సన్యాస దీక్ష తీసుకోనే తీసుకున్నాడు.

చూలకాలుడు కొద్ది సేపు ఆలోచించాడు. 'ఇతన్ని వెనక్కి తీసుకుపోవాలంటే మార్గం ఏంటి?' అని. ఆ వెంటనే అతను కూడా బుద్ధున్ని సమీపించి సన్యాస దీక్ష తీసేసుకున్నాడు. 'ఏదో ఒక సమయంలో తను మహాకాలుడిని కూడా ఒప్పించి అతనితో బాటూ సన్యాసాశ్రమం నుండి వెనక్కి మరలిపోవచ్చు' అని ఆశించాడు చూలకాలుడు.

అటు మహాకాలుడు బుద్ధుడు చూపిన మార్గంలో చాలా వేగంగా ముందుకుపోయాడు. తాను తీవ్రంగా కృషి చేస్తూ, తనలోని ప్రజ్ఞను మేల్కొలుపుకొని, 'అరిహంతుడు' అయ్యాడు. చూలకాలుడు మాత్రం అతనిని వెనక్కి లాగేందుకు

కొనసాగిస్తూనే ఉన్నాడు.

కొన్నాళ్లకు బుద్ధుడు తనతోటి భిక్షువులతో సహా సేతవ్యం చేరుకున్నాడు. నగరం బయట ఉన్న శింశుపా వనంలో వాళ్లందరికీ బస ఏర్పాటు చేయబడింది. నగరంలోని ప్రముఖులంతా ఒకరొకరుగా బుద్ధుడిని, భిక్షువులను తమ ఇళ్లలో భిక్షకు ఆహ్వానిస్తూ వచ్చారు. చూలకాలుడు వదిలేసిన కుటుంబ సభ్యులు కూడా ఒకనాడు ఆయన్ని శిష్యులతో సహా తమ ఇంటికి భిక్షకు రమ్మని ఆహ్వానించారు!

ఆ రోజు ఇంకా తెల్లవారకనే చూలకాలుడు ముందుగా బయలుదేరి ఇంటికిపోయాడు. భోజనానికి ఏర్పాట్లు పర్యవేక్షించటం మొదలుపెట్టాడు. కుటుంబ సభ్యులకు దగ్గరగా మెలిగాడు. వారి కష్ట సుఖాలు అన్నీ తనవిగా స్వీకరించాడు. ఆ రోజు సాయంత్రం భోజనాలు ముగిసేసరికి చూలకాలుడు సన్యాసాన్ని వదిలి యథా ప్రకారం గృహస్తు వేసుకునే బట్టలు ధరించేసాడు! బుద్ధుడు మిగిలిన శిష్యులతో పాటు శింశుపా వనం చేరుకున్నాడు.

తరువాతి రోజున మహాకాలుడి భార్యలు కూడా బుద్ధుడిని శిష్య సహితంగా తమ ఇంటికి భిక్షకు రమ్మని ప్రార్థించారు. 'చూలకాలుడి భార్యల మాదిరే తాము కూడా మహాకాలుడిని వెనక్కి లాక్కోవచ్చు' అని ఆశించారు వాళ్లు. బుద్ధుడు 'సరే'నని శిష్య సమేతంగా వాళ్ల ఇంటికీ వెళ్ళాడు.

భోజనాలు అయిన తర్వాత 'కొద్ది సేపు మహాకాలుడిని మాతో వదిలి వెళ్లండి. మాతోపాటు 'అనుమోదన' చేసేంతవరకు అతన్ని ఉండనివ్వండి' అని మహాకాలుడి భార్యలు బుద్ధుడిని ప్రార్థించారు. బుద్ధుడు ఏమాత్రం సంకోచించక, సరేనన్నాడు. మిగిలిన శిష్యులతోపాటు శింశుపావనం బయలు దేరాడు. పట్టణ పొలిమేరలు దాటుతుండగానే భిక్షువర్గంలో కలవరం మొదలైంది.

అనేక మంది భిక్షువులు బుద్ధుని నిర్ణయం పట్ల అసంతృప్తిని, భయాన్ని వ్యక్తం చేసారు. తన సోదరుడు చూలకారుడి లాగే మహాకాలుడు కూడా భార్యలకు లోబడతాడని, భిక్షు సంఘాన్ని వదిలి వేస్తాడనీ వాళ్లంతా అభిప్రాయపడ్డారు. వారిలో కొందరు బుద్ధునితో తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేసారు కూడా.

బుద్ధుడు నవ్వి ఇట్లా చెప్పాడు: "చూలకాలుడు ఇంద్రియములకు లోబడే రకం- బద్ధకస్తుడు; బలహీనుడు; లోపలినుండి కుళ్లిపోయిన చెట్టులాంటి వాడు. కానీ మహాకాలుడు శ్రద్ధ, స్థైర్యం, శక్తి విశ్వాసాలు ఉన్నవాడు- పర్వతంలాగా ఏమాత్రం చలించని హృదయం అతనిది.

సుభానుపస్సిం విహరంతం ఇంద్రియేసు అసంవుతం
భోజనం హి చామత్తన్నుం కు సీతం హీన వీరియం
తం వే పసహతి మారో, వాతో రుక్ఖం వ దుబ్బలం

అసుభానుపస్సిం విహరంతం, ఇంద్రియేసు సుసంవుతం
భోజనం హి చ మత్తన్నుం సద్ధం ఆరద్ధవీరియం
తం వే నప్పసహతి మారో, వాతో సేలం వ పబ్బతం

"ఎవరైతే తమ మనసుని కేవలం సుఖాన్నిచ్చే వస్తువుల మీద ఉంచుతారో, ఎవరైతే తమ ఇంద్రియాలని వశంలో ఉంచుకోరో, ఎవరైతే ఆహారాన్ని అమితంగా భుజిస్తూ బద్ధకంగా, శక్తి హీనంగా ఉంటారో- అటువంటి వాళ్లు బలహీనమైన వృక్షం గాలికి కూకటి వేళ్లతో పెకలించి వేయబడినట్లు, తప్పక మారునికి లోబడతారు"

"అలా కాక, ఎవరైతే మనస్సును తనలోని కల్మషాలపై నిలుపుతారో, ఎవరైతే ఇంద్రియాలను తమ ఆధీనంలో

ఉంచుకుంటారో, శ్రద్ధ శక్తులు ఎవరిలో అయితే దండిగా ఉంటాయో- అటు వంటి వారు గండ శిలలలో కూడిన పర్వతం గాలికి చలించనట్లు నిశ్చలంగా ఉంటారు; మారునికి ఏమాత్రం లోబడరు"

అని వివరించాడు బుద్ధుడు.

ఆలోగా మహాకాలుడి కుటుంబ సభ్యులంతా అతన్ని చుట్టుముట్టి, బలవంతంగా గృహస్తు ధరించే వస్త్రాలను ధరింపజేసేందుకు ప్రయత్నించారు. కానీ అరహంతుడైన 'మహాకాల ధేరుడు' వారి ఉద్దేశాన్ని గ్రహించాడు; అద్భుతమైన ధ్యాన శక్తితో తక్షణమే అక్కడి నుండి మాయమై వచ్చి, బుద్ధుని పాదాలపై వ్రాలాడు. అతని శ్రద్ధా శక్తులను గ్రహించి, అంతకు ముందు బుద్ధుని నిర్ణయాన్ని తప్పుపట్టిన భిక్షువులంతా కూడా 'ధమ్మ శ్రోతస్సు'లో టక్కున నెలకొన్నారు!

పోటీ లేదు!

"అమ్మా ! అన్నయ్యేడి? "

" స్కూల్ కి వెళ్ళాడు మోక్షా! "

" నాకు సెలవుకదా . మరి అన్నయ్య ఎందుకెళ్ళాడు స్కూల్ కి?"

" అన్నయ్యకు exams . అందుకని స్కూల్ ఉంది "

" ఓహో ! నేనైతే గుడ్ గర్ల్- బాగా చదువుకున్నాను కాబట్టి exam లేదు. "

-శ్రీలత శ్రీరాం, మోక్ష- హైదరాబాదు



సెలక్షన్ బిచ్చగాడు

అవ్వ: ఏం నాయనా! అన్ని ఇళ్ళూ అడుక్కోకుండా కొన్నింటిలో మాత్రమే అడుక్కుంటున్నావు?

బిచ్చగాడు: గొంతు నొప్పి వచ్చిందమ్మా! డాక్టరుగారు అరవద్దన్నారు;. అందుకని ఈ నెలంతా కాలింగ్ బెల్ ఉన్న ఇళ్లకు మాత్రమే వెళ్తాను.

నేతగాడు-డ్రాగన్

రెండవభాగం

జరిగిన కథ : 'తను గొప్పగొప్ప పనులు చేసేందుకే పుట్టాడు' అని అకస్మాత్తుగా గుర్తిస్తాడు నేతగాడు. ఎవరెంత ఎగతాళి చేసినా పట్టించుకోడు. పనికిరాని వస్తువులతోటే కవచమూ, శిరస్త్రాణమూ తయారు చేయించుకొని, ఊళ్ళో కనబడ్డ గుర్రాన్నొకదాన్ని దౌడు తీయిస్తాడు. ఇక చదవండి...

"వెనక్కి రారా, నా గుర్రాన్ని ఎత్తుకెళ్తున్న పనికిమాలిన దొంగా! కుండలు కప్పుకున్న పీనుగా!" అని గుర్రపు యజమాని మిల్లర్ తిట్లు అందుకునే సరికే నేతగాడు అల్లంత దూరం వెళ్ళిపోయాడు. అతని ప్రమేయం లేకుండానే గుర్రం తనకు నచ్చిన దారిన వేగంగా దౌడు తీసింది.

గుర్రపు కళ్లాన్ని ఒడిసి పట్టుకొని, అటూ ఇటూ పడిపోతూ, సరిగ్గా కూర్చునేందుకు తంటాలు పడుతూనే ఆలోచించాడు నేతగాడు: "మాలా సంచారంలో ఉన్న

వీరయోధులు నివసించాల్సింది పనికిమాలిన మొద్దులు, మూర్ఖులు ఉండే పల్లెల్లో కాదు: డబ్లిన్‌లో వెలుగొందే చక్రవర్తి తప్ప, మనకు తగిన పనిని ఇవ్వగలిగే వాడు ఇంకొకడుండడు!" అని.

ఒకసారి నిశ్చయానికి వచ్చాక, అప్పుడిక గుర్రాన్ని ఉత్సాహంగా ముందుకు ఉరికించాడు నేతగాడు. నాలుగు గంటల పాటు నిలబడకుండా ఉరికి, ఆ గుర్రం నిజంగానే డబ్లిన్ చేరుకున్నది. ఒకప్పుడు రాజుగారి గుర్రపుశాలలో పెరిగిందో ఏమో, ఇప్పుడది వాడిని నేరుగా తీసుకెళ్లి, రాజుగారి భవనంలో ఓ చక్కని ఉద్యానవనం మూలన దులపరించింది.

డబ్లిన్ మహారాజు చాలా మంచోడు. తన తోటని చూసేందుకు వచ్చే ప్రజలకోసం అతను అక్కడక్కడా బెంచీలు వేయించి, వాళ్లు కూర్చునేందుకు, అలసట తీర్చుకునేందుకు కూడా తగిన ఏర్పాట్లు చేసి ఉన్నాడు. అట్లాంటి ఓ బండమీద పడుకొని మనవాడు కాలు మీద కాలు వేసుకొని ఏదో ఆలోచిస్తూ ఉంటే, వాడిని అక్కడికి తెచ్చి పడేసిన గుర్రం దగ్గర్లోనే తచ్చాడుతూ, బండల మధ్య పెరుగుతున్న గడ్డి పోసలను మేయటం మొదలుపెట్టింది.

గుర్రం మీద వీరయోధుడు ఆ విధంగా తోటలోకి ప్రవేశించే సమయానికి మహారాజు తన గదిలో వేరే ఏదో పనిచేస్తున్న వాడల్లా దానిని ఆపి, కిటికీలోంచి వాడికేసి చూస్తూ నిలబడ్డాడు. వాడు తనే రాజైనట్లు బండమీద పడుకునేసరికి ఆయనకు బలే

మండింది. గుర్రం మీద సరిగ్గా కూర్చోవటం కూడా రానట్టు అటూ ఇటూ పడుకుంటూ వచ్చి, తన తోటలో నిశ్చింతగా పడక వేసిన ఆ బుడబుక్కల వాడిని చూపిస్తూ తన ప్రక్కనే ఉన్న రాజోద్యోగి ఒకడితో- "ఆ వింత బుడ బుక్కల వాడిని చూశావా? 'నేనేదో మంచివాడినీ, ఆదరించే వాడినీ అనిపించుకునేందుకని, మామూలు జనాలంతా కూర్చుని- ధ్యానం చేసుకునేందుకు వీలుగా ఇట్లా బండలు అవీ పెట్టిస్తే, వీడెవడో ఈ విధంగా దీన్ని హోటల్ మాదిరి మలచుకొని, కాళ్లమీద కాళ్లు వేసుకొని పడుకోవడం ఏమంత సరిగా అనిపించట్లేదు- నువ్వేమంటావు?" అన్నాడు.

"ప్రభూ! తమరి అభిప్రాయంతో ఏకీభవించటం కంటే మేమేమీ చెయ్యం!" అన్నాడు రాజోద్యోగి ఎప్పటిమాదిరే.

"వీడెవడో చాలా వింత దుస్తులు ధరించి వచ్చాడు. తనను గురించి తను ఏమనుకుంటూన్నాడో ఏమో! నేనే స్వయంగా వెళ్లి పరిశీలించి వస్తాను!" అని బయలుదేరాడు రాజు.

ఆ విధంగా రాజు, రాజోద్యోగి ఇద్దరూ అడుగులో అడుగు వేసుకుంటూ అరుగు మీద పడుకున్న నేతగాడి వైపుకు వచ్చారు. వాళ్లు రావటం గమనించిన నేతగాడు మరింత గట్టిగా కళ్లు మూసుకొని నిద్రపోతున్నట్టు నటించాడు.

అయితే "ఒక్కదెబ్బకు డెబ్భై ప్రాణాలు తీసిన వీరయోధుడు ఇతడే" అని రాసి ఉన్న తన డాలును అటువైపుకు వంచి అక్షరాలు బాగా కనపడేటట్టు పెట్టడం మటుకు

మర్చిపోలేదతను.

రాజుగారు దాన్ని చదివి నిజంగానే నిర్ఘాంతపోయారు. "ఓహో, ఏమాశ్చర్యం, ఎంత ఆశ్చర్యం?!, ఇతని కోసమే కదా నేను ఇన్నాళ్లు ఎదురుచూస్తున్నది?! అన్నాడు పరవశంగా కళ్లు మూసుకుంటూ.

"ప్రభూ! ఏ పని కోసం?!" అడిగాడు రాజోద్యోగి.

"ఇంకెందుకు, నా రైతుల్ని వేధిస్తూ , వారి శ్రమ ఫలితమైన పంటల్ని నాశనం చేస్తూ, వాళ్ళు పెంచే కోళ్లను, జీవుల్ని స్వాహా చేసే డ్రాగన్‌ను ఇతని వంటి వీరయోధులు కాక మరెవరు చంపుతారు?!" అన్నాడు రాజు చటుక్కున.

ఉద్యోగికి కొద్దిసేపు నోటమాట రాలేదు. చివరికి ధైర్యం తెచ్చుకొని వాడు "క్షమించాలి మహారాజా! అంతమంది వీరయోధులు- నిజఖడ్గ సంపద గలవారు, మొక్కవోని ధైర్య సాహసాలు గలవారు- అంతమంది చేయలేని పనిని, ఈ మామూలు బుడబుక్కలవాడు చేయగలడంటారా?" అనుమానంగా అడిగాడు.

"ఖచ్చితంగా చేస్తాడు. వాడి డాలు మీద ఏమి రాసి ఉందో చదవలేదా?! ఒక్క దెబ్బకు డెబ్భై ప్రాణాలు తీసాడట! అలాంటి వాడికి డ్రాగన్‌ని చంపటం ఒక్క లెక్కా?" అంటూ రాజుగారు పోయి నేతగాడి భుజం పట్టుకొని కుదిపాడు.

అప్పుడే కళ్లు తెరిచిన నేతగాడు హుందాగా పెదాలు విరుస్తూ "మరి ఇప్పుడు ఎవరొచ్చారు, మా సేవలకి?!" అన్నాడు.

మహారాజు ఒక్కసారిగా నిటారుగా నిలబడి, అటూ ఇటూ చూస్తూ, గట్టిగా గాలి పీల్చుకొని "మ్‌మ్‌మ్.. మరి నేను డబ్లిన్

మహారాజునే కదా?" అన్నాడు ఒకింత అనుమానంగా.

అది వినగానే నేతగాడు టక్కున లేచి, మోకాళ్ళమీద నిలబడి, రాజుగారి కాళ్ళు పట్టుకున్నాడు: "ప్రభూ, నన్ను క్షమించండి. నా ఆజ్ఞానాన్ని క్షమించండి. మిమ్మల్ని గుర్తించక నేను చేసిన అపరాధాలని మన్నించండి. ఈ అల్పుడిని క్షమించానని మాట ఇవ్వండి ముందు-లేకపోతే మీ కాళ్ళు వదిలేది లేదు!" అంటూ.

దాంతో రాజుగారికి తన మర్యాద నిలిచిందని సంతోషం వేసింది. 'దాంతోపాటు వీడు అన్నంతపనీ చేస్తాడ'ని భయం కూడా వేసింది. అందుకని నేతగాడికి అభయాన్నిస్తూ "దూర ప్రయాణపు బడలికతో అలసి ఉంటావు ఓ వీరుడా! ఏమీ పరవాలేదు! నిన్ను క్షమించాం!" ఇంతకీ ఇక్కడ ఏం చేస్తున్నావు నువ్వు, మా ఈ రాతి బండమీద?!" అని అడిగాడు రాజు.

"ప్రభూ! తమరి సైన్యంలో సంచారయోధుడిగా సేవలందించేందుకే నేను డబ్లిన్‌కి చేరుకున్నాను!" అన్నాడు నేతగాడు గౌరవంగా.

"ఓ! అలానా!" సంతోషంగా అన్నాడు రాజు- "నీ వంటి వీరుడికి ఏ మాత్రమూ కష్టం కలిగించని పని ఒకటి ఉన్నది నా దగ్గర. డెబ్భై ప్రాణాలు ఏమీ కాదు కనీసం! దానికంటే చాలా చిన్న పనే! కేవలం చిన్న-పనికిమాలిన డ్రాగన్ ఒకటి నా రాజ్యాన్నంతా చికాకు పెడుతోంది. ప్రజల్ని కష్టపెడుతోంది; వాళ్ల కోళ్లను తింటోంది. కనీసం నేను తినేందుకు కూడా గుడ్లు దొరకట్లేదు!" అన్నాడు రాజు బాధగా ముఖం పెట్టి.

"దాని పని అయిపోయినట్లే ప్రభూ! ఇలాంటి చిన్న పనులు నాకు ఎంత పాటివి!" అన్నాడు నేతగాడు తేలికగా ముఖం పెట్టి.

"క్షమించు వీరయోధా! నీ శౌర్యానికి తగిన పని కాదేమో, ఇది!" అన్నాడు రాజు కొంచెం అనుమానంగా. "కానీ నాక్కూడా ఈ డ్రాగన్‌కు అస్సలు ఏమాత్రం బయపడాల్సిన అవసరం లేదనుకో; అయినా ఏం చెయ్యను?! అది ఎక్కడో 'కౌంటీ గాల్వే' అనే ఊళ్లో ఒక బురద గుంట ఊబిలో ఉంటోంది ఇప్పుడు. అక్కడికి వెళ్ళాలంటే మరి నాకేమో బోల్డన్ని పనులాయె!" చెప్పాడు, విచారాన్ని తెచ్చిపెట్టుకున్న ముఖంతో.

"మీరేమీ విచారించకండి ప్రభూ! నన్ను తక్షణం అక్కడికి తీసుకెళ్లమనండి!" అన్నాడు నేతగాడు, తెగించి.

"అదే నాకు నచ్చింది!" అన్నాడు రాజు సంతోషంగా "నా డబ్బుకు తగిన వీరుడివి నువ్వే"

"ఓ.. డబ్బు అంటే గుర్తొచ్చింది.." అన్నాడు నేతగాడు. "నా ప్రయాణాన్ని నిరాటంకంగా కొనసాగించేందుకు నాకు కొంచెం డబ్బుల అవసరం ఉంటుంది..."

"ఓ.. దానిదేముంది, నీకెంత కావాలో అంత తీసుకో!" అన్నాడు రాజు, అతన్ని ఓ అలమార దగ్గరకు తీసుకుపోతూ.

ఆ అలమారలో నిండా పాత మేజోళ్ళు ఉన్నై. ఆ మేజోళ్ళలో నిండా బంగారు నాణాల్ని దాచి పెట్టుకున్నాడు రాజు. నేతగాడు ముందుకెళ్ళి, తన కవచంలో పట్టినన్ని నాణేల్ని నింపుకున్నాడు.

"ఇక మన గుర్రపు శాలకు వెళ్దాం పద! నీకు చురుకైన కొత్త గుర్రం అవసరం ఉంది!" అని రాజుగారు వాడిని తన గుర్రపుశాలకు తీసుకెళ్లాడు. మిల్లర్ గాడి ముసలి తొక్కు గుర్రాన్ని అక్కడే వదిలేసి, బదులుగా రాజుగారు చూపించిన ఓ మంచి కుర్ర గుర్రాన్ని పుచ్చుకున్నాడు నేతగాడు. (తర్వాత ఏమైందో వచ్చేమాసంలో చదవండి...)



పట్టాభిషేకం

రచన: శివ లక్ష్మి, ఇబ్రహీం పట్నం, క్రిష్ణా జిల్లా.

విక్రమపురిరాజు విజయసింహుడికి వివాహం అయిన చాలా సంవత్సరాలకు రాణి పద్మావతి దేవి గర్భం దాల్చింది. నెలలు నిండకనే మగ శిశువును ప్రసవించింది.

ఆ సమయానికి విజయసింహుడు నగరంలో లేడు. అతను వచ్చి చూసేసరికి పిల్లవాడు పురిట్లోనే కన్ను మూశాడన్న వార్త అందింది. పుత్ర సంతానం మీద విపరీతమైన అభిమానాన్ని పెంచుకున్న రాజు తీవ్ర నిరాశకు గురయ్యాడు. మనస్తాపంతో అనారోగ్యం పాలై త్వరలోనే కాలం చేశాడు .

తదనంతరం రాజ్యం అతని తమ్ముడు

మాధవసేనుడి పాల పడింది. మాధవసేనుడికి విజయసింహుడికున్న మంచి గుణాలేవీ లేవు. దాంతో పరిపాలన గతి తప్పింది. ప్రజలు అష్టకష్టాలు పడనారంభించారు. మాధవ సేనుడు అవసరం లేనివాటికి నిధులు లేవనేవాడు. అనవసరమైనవాటికి లెక్కలేనన్ని నిధులిచ్చేవాడు.



కొలువులో ఉన్న ఉద్యోగులకు అడగకుండానే జీతాలు ఇమ్మడి ముబ్బడిగా పెంచాడు. ఆ భారాన్ని తట్టుకోడానికి ధరలనూ పెంచాడు. యువకులకు పనులు దొరకలేదు. దొంగలు ఎక్కువయ్యారు. మద్యాన్ని ప్రభుత్వమే అమ్మాలని, ప్రతి వ్యక్తీ తప్పక మద్యాన్ని సేవించాలని శాసనం చేసాడు రాజు. వీటన్నింటితోటీ పాలన అస్తవ్యస్తమైంది. తిరుగుబాటు దారులు తయారయ్యారు.

ఇట్లా కొన్నేళ్ళు గడిచాక మాధవసేనుడు హత్య చేయబడ్డాడు. అతగాడికి కుమారులు లేకపోవటంతో రాజే లేకుండా పోయాడు.

ఇప్పుడు 'ఎవరిని రాజును చేయాలా' అని పెద్దలంతా తలపట్టుకొని కూర్చున్నారు. చివరికి అందరూ కలిసి ఓ నిర్ణయానికొచ్చారు: పట్టపుటేనుగుకి పూలమాలనిచ్చి పురవీధులలో త్రిప్పాలి. అది ఆ మాలను ఎవరి మెడలో వేస్తే వారే రాజు.

అయితే వాళ్ళు ఇలా చేస్తారని ముందుగానే ఊహించాడు పట్టపుటేనుగును పోషించే

మావటి. అతనిలో దురాశ ప్రారంభమైంది. మనసులోనే ఓ ప్రణాళికను రూపొందించుకున్నాడు. ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా తన ప్రణాళికను కార్యరూపంలో పెట్టాడు.

యుక్తవయస్కుడైన తన కొడుకును గజశాలకు రమ్మన్నాడు. ఏనుగుకి అనేక పర్యాయాలు పూలమాలనిచ్చి, తన కొడుకు మెడలో వేయించాడు. ఇలా దానికి శిక్షణ నిచ్చే అవకాశాన్ని దొరికినన్ని రోజులపాటు తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నాడు!

అంతలో అనుకున్న ముహూర్తం రానే వచ్చింది. పట్టపుటేనుగుకు పూలమాలనిచ్చి పుర వీధులలో వదిలారు. లక్షలాది మంది పురజనులు రహదారులకు రెండు వైపులా నిలబడి జయజయధ్వానాలు చేయసాగారు. అనేకమంది ఏనుగును అనుసరించసాగారు. ఏనుగు అందరినీ దాటుకొని సరిహద్దుల్లో ఉన్న దేవాలయం వద్దకు చేరుకున్నది.

దేవాలయం ముందు నుంచుని ఉన్నాడు మావటి కుమారుడు. ఏనుగు ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తూ ఆ కుర్రవాడిని సమీపించింది.

సరిగ్గా అదే సమయానికి భగవంతుడికి సమర్పించేందుకు కొన్ని ఫలాలు పట్టుకొని అటుగా వచ్చాడొక బ్రాహ్మణ యువకుడు ఆదిత్యుడు. ఏనుగు అతన్ని చూడగానే దిశ మార్చుకున్నది. అతగాడి మెడలో పూలమాలను వేసి, అతని చేతిలోని

పండ్లను తను తీసుకున్నది.

గుడిలో గంటలు గణ గణ మోగాయి

పురజనులందరూ పట్టపుటేనుగు నిర్ణయాన్ని స్వాగతించారు. మావటివాడు, ఆతని కొడుకు నిర్ఘాంతపోయారు. ఆదిత్యుడు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. అతని తండ్రి సుదర్శనాచార్య మాత్రం మనసులోనే భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుని, ఎన్నో ఏళ్ల క్రితం తను చేసిన తప్పును తలచుకొని పశ్చాత్తాపపడ్డాడు: రాజు అవ్వాలనే దురాశతో మాధవసేనుడు తనను బెదిరించి రాణీవారి సందిటనున్న పురిటి బిడ్డకు మత్తు మందు ఇప్పించాడు. ఆపైన వాడు చనిపోయాడని చెప్పించి; అందరినీ నమ్మించటమే కాక, ఆ విధంగా విజయసింహుడి మరణానికి కారకుడైనాడు. అట్లా చివరికి తానే రాజైనాడు! ఇక తను అతని ఆజ్ఞ ప్రకారం ఆ పిల్లవాడిని చంపలేక, ఎవ్వరికీ తెలీకుండా రహస్యంగా తన బిడ్డగా పెంచాడు- నిజానికి ఆదిత్యుడు విజయసింహుడి కొడుకే! ధర్మాత్ముడైన రాజుగారి కొడుకుకే తిరిగి రాజ్యం దక్కింది!

అనుకోకుండా రాజైన ఆదిత్యుడు కాలక్రమాన గొప్ప పరిపాలకుడుగా పేరు తెచ్చుకున్నాడు.

రవి: చిన్నప్పుడు నేనేం కావాలనుకున్నానో అదే అయ్యాను.

రమేష్: ఏం కావాలనుకున్నావు?!

రవి: పెద్దవాణ్ని కావాలనుకున్నాను.

చాలా కొంచెం!

టీచర్: రేఖా! నిన్న అక్షాంశం అంటే ఏంటో నేర్చుకురమ్మన్నాను- నేర్చుకొచ్చావా?

రేఖ: ఎంత చదివినా గుర్తుండట్లేదు మేడం, కొంచెం వచ్చిందంటే కొంచెం మర్చిపోతున్నాను!

టీచర్: ఎంత వస్తే అంత చెప్పు, పర్లేదు!

రేఖ : ఉం.. ఉం.. అక్షాంశం అంటారు!

బొమ్మలు-పదాలు 1

రెండో తరగతి పిల్లలకు ప్రత్యేకం : *ఇక్కడ పదిహేను బొమ్మలున్నై. ఒక్కో బొమ్మనుండీ* ***రెండక్షరాల పదం*** *ఒకటి తయారవుతుంది- చూడండి. వింత ఏంటంటే ఆ పదిహేను పదాలూ 'అ ' తోటే మొదలౌతున్నై! బొమ్మల్ని చూసి పదాలు కనుక్కోండి మరి !*

నిర్వహణ : శ్రీమతి ఆదూరి హైమావతి, అమెరికా సంయుక్త రాష్ట్రాలు

1

2

3

4

5

6

7

8

9



10

11

12

13

14

15



ఇట్లా రాబోయే ఆరు కొత్తపల్లుల్లో వచ్చిన పదాలన్నీ దాచి పెట్టుకోండి. చివరికి, ఆర్నెల్ల తర్వాత అన్నిటినీ ఓ పోస్టు కార్డు మీద రాసి పంపాలి మాకు! అట్లా అన్నీ సరిగా రాసి పంపిన **రెండో తరగతి పిల్లల్లో** లాటరీ ద్వారా ఎంపికైన **ఇద్దరికి** - ఒక్కొక్కరికీ 500 రూ. బహుమతి ఇవ్వబడుతుంది !

పదరంగం-86 విజేత ఒక్కడే:

బోయిని అజయ్, ZPHS, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా.

బొమ్మకు కథ రాయండి

పదరంగం-87

నిర్వహణ: డా. సిరి, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం



అడ్డం:

1. 'దేవ' తో మొదలయ్యే వృక్షం- హిమాలయాల్లో ఎక్కువగా కనిపిస్తుంది (4)
4. 'సగం' కి ఇంకో పేరు (2)
5. విష్ణుమూర్తి భార్య ఎవరు? (2)
7. తెలుగు సంవత్సరాలు ఎన్ని (3)
8. 'నిలయం' అటు నుండీ ఇటు వచ్చింది (3)
10. 'నావ' కుడి నుండి ఎడమ వైపు వెళ్తోంది (2)
11. కొమ్మొచ్చిన హిందీ సైనికుడు (3)
12. పేరులో 'గొంగళి' కలిగిన పురుగు. సీతాకోక చిలుక ఎదిగే క్రమంలోని ఒక దశ (6)

నిలువు:

1. గుడి (4)
2. సూదిలో ఎక్కించేది (2)
3. రోజులో ఎన్ని గంటలు ఉంటాయి? (6)
4. 'అరవము'లో చివరి అక్షరం మాయమైంది (3)
6. తిరగబడిన 'గజలక్ష్మి' (4)
9. 'నివాళులు' కి ఏకవచనం (3)
12. 'పానుపు'లో మొదటి అక్షరం ఎటో వెళ్లింది (3)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి.

సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి - 89 ని బహుమతిగా పంపిస్తాం!

కొత్తపల్లిని మీ మిత్రులకు, మీరు చదివిన బడులకు, మీ సమీపంలోని లైబ్రరీలకు బహూకరించండి!

రాబోయే 12 సంచికలకై ముందస్తు చందా:

వ్యక్తులకు: **300**/- (పోస్టేజీ మరియు యస్సెమ్మెస్ ఛార్జీలు కలిపి)

సంస్థలకు: **350**/-

గమనిక: అచ్చయిన పుస్తకాలు ఎప్పటికప్పుడు సాధారణ పోస్టులో పంపబడతాయి.

NEFT TRANSFER కోసం అక్కౌంటు వివరాలు:

"Kottapalli Prachuranalu"
SB A/c 62320333310,
State Bank of Hyderabad
Dharmavaram Branch
IFSC: SBHY0020902

Transfer వివరాలను మాకు మెయిల్ ద్వారా తెలియజేయండి: team@ kottapalli.in

(బ్యాంకు వారి కొత్త నియమాలననుసరించి, "క్యాష్ హ్యాండ్లింగ్ చార్జీలు"గా ప్రతిసారీ రూ. 50 అదనంగా చెల్లించవలసి వస్తున్నది.. అందువల్ల బ్యాంకులో డబ్బు కట్టకండి- నేరుగా మీ అక్కౌంటు నుండే ట్రాన్సఫర్ చేయగలరని ప్రార్థన)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:

క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) **(పోస్టేజి రూ 50 అదనం)**
1	2011 set	9	15	180
2	2012 Set	11	20	220
3	2013 Set	7	16	175
4	2014 Set	10	448	250
5	2015 Set	7	1090	175

మరిన్ని వివరాలకై సంప్రతించండి: కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, 515101. ఫోను: 7702877670, 9000453887. ఇ-మెయిలు : team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 05/10/2016 Postal Regn No: HDP/008/2015-2017

పిల్లల నైతిక పాఠాలు

"కథలు చదివితే ఏమొస్తది? మా పిల్లలకు ఏమైనా మార్కులొస్తాయా?"

"మీ పిల్లలతో అప్పుడప్పుడు మంచి కథల పుస్తకాలు చదివించండి" అని ఒక ఉపాధ్యాయుడు ఇచ్చిన సలహాకు కొందరు తల్లిదండ్రుల సమాధానం అది. తమ పిల్లలకు బాగా మార్కులు రావాలి; తొందరగా అమెరికా పోవాలి; అక్కడి నుండి వాళ్ళు డాలర్లు పంపాలి- ఇవి, నేడు చాలా మంది తల్లిదండ్రుల కోరికలు.

మార్కుల గొడవలో పడి నిజమైన చదువేదో గుర్తించడం లేదు వాళ్ళు. తల్లిదండ్రుల ఈ బలహీనతను ఆసరా చేసుకొని సొమ్ము చేసుకునే వాళ్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అందుకే నేటి యువకులకు నిజమైన జీవితం దూరమౌతోంది. మార్కుల మాయలో ఈదుకుంటూ వచ్చిన వాళ్లంతా నేడు జీవితాన్ని వెళ్లదీస్తున్నారే కానీ, నిజంగా జీవించటం లేదు. అలా తమ పిల్లలకు మార్కుల కోసం వెంపర్లాడే తల్లిదండ్రులకు చెంపపెట్టులా నిజమైన చదువు ఏమిటో చెబుతుంది, విద్వాన్ వీరభద్రప్పగారు రాసిన 'సంపంగి' కథా సంపుటి.

ప్రతి బడిలోనూ వారానికి రెండో మూడో మోరల్ ఎజుకేషన్ పీరియడ్స్ ఉంటాయి. అందులో పిల్లలకు నీతి కథలు, మంచి వికాసం కలిగించే అంశాలు చెప్పాలి. అయితే ఈనాడు పిల్లలకు 'సైన్సు, లెక్కలు, ఇంగ్లీషుల్లో మార్కులు వస్తే చాలు- మోరల్ పీరియడ్ ఎందుకు?' అనే భావన ఉన్నందున, దానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం లేదు. అయితే పిల్లలకు నైతికతను, జీవితపు విలువలను నేర్పించటం చాలా అవసరం. అదే నిజమైన చదువు కూడా. ఈ చదువు లోపించడం మూలానే మన జీవన విధానం అస్తవ్యస్తమయింది. వ్యక్తి స్వార్థం ఎక్కువయ్యింది. "ఈ పని నాకెందుకు, ఎవరో ఒకరు చూసుకుంటారులే" అనే ఉదాసీనత ఎక్కువైంది. ప్రస్తుతం మనిషి సాటి మనిషిని ప్రేమించడం మానేశాడు. అంతేకాదు- డబ్బు సంపాదించటంలో పడి, మరమనిషిలా తయారై, యాంత్రిక జీవనపు చట్రంలో తన్నుకులాడుతున్నాడు, ఆ ప్రవాహంలో కొట్టుకుపోతూ, చివరికి తనను తాను ప్రేమించుకోవడం కూడా మానేశాడు మనిషి!

వీటన్నిటికి కారణం, సంస్కారం రూపు దిద్దుకునే తరుణంలో మంచి బాలసాహిత్యం పిల్లలకు అందకపోవటమే. మనిషి జీవితాంతం ఆరోగ్యంగా బ్రతకడానికి చిన్నప్పుడు తల్లిపాలు ఎంత ముఖ్యమో, లేత వయసులో చక్కని బాలసాహిత్యం అందించడం కూడా అంతే ముఖ్యం. తల్లిపాలు వాళ్లకు శారీరకం బలాన్నిస్తాయి; బాలసాహిత్యం వాళ్లకు మానసిక స్థైర్యాన్ని, మంచి అలవాట్లను అందిస్తుంది.

-దాసరి వెంకట రమణ, బాల సాహిత్య పరిషత్ ('సంపంగి' కథల సంపుటానికి ముందుమాటగా..)

Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at "Kottapalli", 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.